తాను కష్టాలలో ఉన్నప్పుడు
కూడా
నవ్వగలిగే వారు
నాకు ఆదర్శం

తాను ఆపదలో ఉన్నప్పుడు
కూడా
ఇతరులకు సహాయం
చేయగలిగే వారు
నాకు స్ఫూర్తి


TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు DD9 వార్త

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 21 | 01-05-2026 సోమవారం | పేజీలు: 06 | వెల: 3/-


ఆదిలాబాద్ రిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు

## ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం




03

# ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ



హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం..
గుల్బర్గా పర్యటనకు బయల్దేరిన ఖర్గేకు ఆత్మీయ కలయిక
రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం హాజరు.. ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశం
సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో స్వాగత కార్యక్రమం.. పార్టీ ఐక్యతపై చర్చ
పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సంస్థాగత అంశాలపై చర్చ
పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సమన్వయంపై దృష్టి
కాంగ్రెస్ బలోపేతానికి సూచనలు చేసినట్టు సమాచారం
రాష్ట్ర రాజకీయ పరిణామాలపై సమీక్షించిన జాతీయ అధ్యక్షుడు ఖర్గే
భవిష్యత్ వ్యూహాలపై నేతలతో అభిప్రాయాల మార్పిడి
సమగ్ర పార్టీ సమన్వయానికి దిశానిర్దేశం చేసిన భేటీగా వర్ణన

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ నగరంలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ఘన స్వాగతం పలికింది. గుల్బర్గా వెళ్లేందుకు హైదరాబాద్ మీదుగా ప్రయాణించిన ఆయనకు ఎయిర్‌పోర్ట్‌లో పార్టీ ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో హాజరై ఆత్మీయంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు ఖర్గేను కలుసుకుని స్వాగతం పలికాయి. ఈ సమావేశం పూర్తిగా అనౌపచారికంగా జరిగినప్పటికీ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం వంటి కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. కాంగ్రెస్ రాష్ట్ర మంత్రులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీహరి సహా పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అదే విధంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ కూడా హాజరై ఖర్గేతో ప్రత్యేకంగా మాట్లాడారు. శంషాబాద్ విమానాశ్రయంలో జరిగిన ఈ ఆత్మీయ కలయికలో నాయకులందరూ ఖర్గేకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. పార్టీ శ్రేణుల ఉత్సాహం కనిపించేలా పెద్ద సంఖ్యలో ..మిగతా 2లో

# రైతు డిస్కం పేరుతో కొత్త నాటకం

రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు
రైతు డిస్కం రైతు మెడకు ఉరిలాంటిదని వ్యాఖ్య
గతంలో 3 గంటల విద్యుత్ చాలన్నారని ఆరోపణ
ఇప్పుడు మాట మార్చి కొత్త ప్రతిపాదనలు తెస్తున్నారని విమర్శ
కంటోన్మెంట్ ఉప ఎన్నిక హామీలు ఏమయ్యాయని ప్రశ్న
ఆరు వేల ఇళ్లు కట్టిస్తామన్న హామీ అమలుపై నిలదీత
ఇప్పటివరకు ఆరు ఇళ్లయినా కట్టించారా అని ప్రశ్న
420 హామీలు అమలు చేసి చూపించాలని డిమాండ్
కేసీఆర్ హయాంలో సంక్షేమ పథకాలు అమలయ్యాయని వ్యాఖ్య
భారీ అప్పులు చేసిన ప్రభుత్వం ఏం సాధించిందని ప్రశ్న
కంటోన్మెంట్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగం



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, రైతు డిస్కం పేరుతో సీఎం కొత్త నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. గతంలో సాగుకు రోజుకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు రైతు డిస్కం ఏర్పాటు చేస్తామని మాట్లాడుతున్నారని కేటీఆర్ అన్నారు. రైతు డిస్కం అనేది రైతుల ప్రయోజనాల కోసం కాదని, రైతు మెడకు ఉరిలా మారే వ్యవస్థ అని విమర్శించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల సమయంలో స్థానికంగా ఆరు వేల ఇళ్లు నిర్మిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఇప్పటి వరకు ఆరు ఇళ్లు అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను అమలు చేసి చూపించాలని ..మిగతా 2లో

# తెలంగాణలో నిప్పుల కొలిమి

జూన్ 3 వరకు తీవ్రమైన వడగాల్పులు
హైదరాబాద్ వాతావరణ కేంద్రం 'ఆరెంజ్ అలర్ట్' జారీ
రాష్ట్రవ్యాప్తంగా ముదురుతున్న ఎండల తీవ్రత
జూన్ 3 వరకు ఊరట లేదన్న అధికారులు
41 డిగ్రీల నుండి 44 డిగ్రీల వరకు సాధారణ ఉష్ణోగ్రతలు
పలు జిల్లాల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం
బెల్లంపల్లిలో అత్యధికంగా 45.4 డిగ్రీలు నమోదు
రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు 13 మంది మృత్యువాత
ఉమ్మడి ఖమ్మంలోనే ఐదుగురు మృతి
తెలంగాణలో జూన్ 10వ తేదీ
తర్వాతే వర్షా లు కురిసే అవకాశం
అప్పటివరకు ఉక్కపోత తప్పదన్న వాతావరణ శాఖ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత అంచనాలకు అందకుండా పెరిగిపోతోంది. రోహిణి కార్తె ప్రభావానికి తోడు భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం రాష్ట్ర ప్రజలకు అత్యంత కీలకమైన హెచ్చరిక జారీ చేసింది. రాబోయే జూన్ 3వ తేదీ వరకు రాష్ట్రంలో ఎండల తీవ్రతతో పాటు భరించలేని వడగాల్పులు కొనసాగుతాయని ..మిగతా 2లో

# రైతు డిస్కం వెనుక ప్రైవేటీకరణ కుట్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కవిత విమర్శలు
రైతు వ్యతిరేక విధానాలు
అవలంబిస్తున్నారని ఆరోపణ
24 గంటల ఉచిత విద్యుత్‌పై
అధికారిక ప్రకటన చేయాలని డిమాండ్
మీడియా చిట్‌చాట్‌లో కాకుండా
స్పష్టత ఇవ్వాలన్న సూచన
అవసరమైతే సుప్రీంకోర్టు
వరకు వెళ్తామని హెచ్చరిక
కొత్త సోలార్ జీవో కార్పొరేట్‌లకే
మేలు చేస్తోందని విమర్శ
ఖమ్మం ఆసుపత్రి ఘటనపై ఆగ్రహం
చిన్నారి పేరిట రూ.25 లక్షల
ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్
లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై పాదయాత్ర హెచ్చరిక



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు చేశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆమె, ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తామని, ..మిగతా 2లో

# ఎండలపై అప్రమత్తంగా ఉండాలి

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ సూచనలు
దేశ క్రీడాకారుల రికార్డులపై ప్రశంసల జల్లు
దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి
తీవ్రమవుతున్న ఎండల నేపథ్యంలో అత్యవసర సూచన
బయటకు వెళ్లేటప్పుడు తాగునీరు వెంట ఉంచుకోవాలి
మజ్జిగ, షర్బత్‌లు ఎక్కువగా తాగాలని పిలుపు
జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో నాలుగు కొత్త రికార్డులు
భారత క్రీడాకారులపై ప్రధాని మోదీ ప్రశంసలు
100 మీటర్ల పరుగు పందెంలో సరికొత్త చరిత్ర
గురిందర్‌వీర్,
అనిమేష్ కుజుర్‌లను కొనియాడిన మోదీ
కేరళకు చెందిన స్విమ్మింగ్ క్లబ్ ఉచిత ఈత శిక్షణ
సేవలను ప్రత్యేకంగా అభినందించిన ప్రధానమంత్రి
క్రీడాకారుల ప్రదర్శనలు
యువతకు స్ఫూర్తినిస్తాయన్న మోదీ



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 134వ ఎపిసోడ్ ద్వారా దేశ విదేశాల్లోని పౌరులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ వేదిక ద్వారా ఆయన దేశంలో జరుగుతున్న సామాజిక పరిణామాలు, క్రీడా విజయాలు మరియు వాతావరణ మార్పులపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఎప్పటికప్పుడు సరికొత్త ..మిగతా 2లో

# గండిపేటలో భూకబ్జా గుట్టురట్టు

వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి హస్తం
సంచలన వివరాలు వెల్లడించిన డీసీపీ శ్రీనివాస్
ఐఏఎస్ అధికారుల సంతకాలు, నకిలీ జీవోలు ఫోర్జరీ
రూ.1500 కోట్ల విలువైన సర్కారు భూమి కొట్టేసేందుకు ప్లాన్
నకిలీ ఆర్డర్లు, జీవో సృష్టించడం కోసం నిందితుడికి రూ.4 కోట్లు
కలెక్టరేట్, సీసీఎల్ఏ, హైడ్రా కార్యాలయాల నుంచి క్లియరెన్స్ పత్రాల సృష్టి
రాధాకృష్ణ లాయర్ల బృందానికి నకిలీ డాక్యుమెంట్ల తయారీ కోసం మరో రూ.4 కోట్లు
పత్రాలు తరలిస్తుండగా రాధాకృష్ణ డ్రైవర్ ప్రవీణ్‌ను పట్టుకున్న పోలీసులు
నిందితుడి నుంచి భారీగా నకిలీ జీవో కాపీలు, ల్యాప్‌టాప్‌లు, స్టాంపులు స్వాధీనం
గతంలో 9 కేసుల్లో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ
కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాల్లోనూ స్థలాల దందాలు చేసినట్లు వెల్లడి
ఇప్పటివరకు ఐదుగురు నిందితుల అరెస్ట్
పరారీలో ఉన్న మరో ఐదుగురి కోసం ప్రత్యేక గాలింపు



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హైదరాబాద్ శివార్లలోని అత్యంత ఖరీదైన గండిపేట ప్రాంతంలో భారీ భూకుంభకోణం వెలుగుచూసింది. సుమారు రూ.1,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఒక పెద్ద కుట్రను సైబరాబాద్ పోలీసులు భగ్నం చేశారు. ఈ అంతరాష్ట్ర భూకబ్జా దందాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కీలక సూత్రధారిగా వ్యవహరించినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ అధికారికంగా వెల్లడించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల పరం చేసేందుకు నిందితులు పక్కా స్కెచ్ వేశారని, అయితే సకాలంలో సమాచారం అందడంతో ఈ భారీ స్కామ్‌ను ..మిగతా 2లో

# ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**మొదటిపేజీ తరువాయి**

నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. ఖర్గేను కలిసిన ప్రతి నాయకుడు రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం అవసరాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సహా ముఖ్య నేతలు రాష్ట్రంలో పార్టీ ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వ పాలనపై ఉన్న అభిప్రాయాలు, భవిష్యత్ వ్యూహాలపై జాతీయ అధ్యక్షుడితో చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలపరచాలని ఖర్గే సూచించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మంత్రులు, పీసీసీ నాయకత్వం కలిసి రాష్ట్రంలో పార్టీ యూనిట్‌ల సమన్వయం, కార్యకర్తల సమీకరణ, స్థానిక స్థాయిలో నాయకత్వ అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వచ్చే రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడానికి బలమైన సమన్వయం అవసరమని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పార్టీ అంతర్గత వ్యవస్థ, జిల్లా స్థాయి కమిటీల పనితీరు, కార్యకర్తల సమస్యలపై ఖర్గేకు వివరించినట్లు చెబుతున్నారు. పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలో పార్టీ సమన్వయం మరింత మెరుగుపరచాల్సిన అవసరాన్ని ప్రస్తావించినట్లు సమాచారం.

ఈ భేటీలో రాష్ట్ర రాజకీయ పరిణామాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాల అమలు, ప్రజల్లో పార్టీపై ఉన్న అభిప్రాయాలు, భవిష్యత్ ఎన్నికల దిశగా తీసుకోవాల్సిన వ్యూహాలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష జరిగినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. విమానాశ్రయంలో జరిగిన ఈ సమావేశం స్వల్ప సమయమే జరిగినప్పటికీ, రాజకీయంగా దీనికి ప్రాధాన్యం పెరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు ఒకే వేదికపై కనిపించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఖర్గే గుల్బర్గా పర్యటనకు బయల్దేరే ముందు జరిగిన ఈ కలయికను పార్టీ వర్గాలు "ఆత్మీయ భేటీ"గా అభివర్ణించాయి. అయితే, ఈ సమావేశం ద్వారా రాష్ట్ర కాంగ్రెస్ భవిష్యత్ వ్యూహాలపై ఒక స్పష్టమైన దిశానిర్దేశం జరిగిందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మొత్తానికి శంషాబాద్ విమానాశ్రయంలో జరిగిన ఈ అనూహ్య ఆత్మీయ కలయిక రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపినట్లు కనిపిస్తోంది. పార్టీ బలోపేతం, సంస్థాగత సమన్వయం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై ఖర్గే ఇచ్చిన సూచనలు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# తెలంగాణలో నిప్పుల కొలిమి

**మొదటిపేజీ తరువాయి**

వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈ నాలుగు రోజుల పాటు ఎండల ప్రభావం అత్యంత ప్రమాదకరంగా ఉండే అవకాశం ఉన్నందున రాష్ట్రంలోని పలు జిల్లాలకు అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' (ఆరెంజ్ హెచ్చరికలు) జారీ చేశారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదవుతాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

**45 డిగ్రీలు దాటనున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు**

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో ఎండలు మరింత ముదరనున్నాయని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాల్లో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుండి 44 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని ఉత్తర, విండ్ జోన్ జిల్లాల్లో ఈ ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీల మార్కును దాటిపోవచ్చని హెచ్చరించారు. వేడి గాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల వాతావరణంలో వేడి ఒక్కసారిగా పెరిగిపోతుందని, ఇది మనుషుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండటంతో ఉక్కపోత తీవ్రమవుతోంది.

**జిల్లాల వారీగా వడగాల్పుల తీవ్రత**

రాబోయే నాలుగు రోజుల్లో ఏయే జిల్లాలపై ఎండల ప్రభావం ఎంతవరకు ఉంటుందనే దానిపై వాతావరణ కేంద్రం ఒక స్పష్టమైన నివేదికను విడుదల చేసింది. ఈ అంచనాల ప్రకారం.. మే 31న రాష్ట్రంలోని అత్యధికంగా 28 జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని పేర్కొంది. ఆ తర్వాత జూన్ ఒకటో తేదీన 11 జిల్లాలు, జూన్ రెండో తేదీన 12 జిల్లాలు, అలాగే జూన్ మూడో తేదీన 17 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయని వివరించింది. ఈ నిర్ణీత రోజుల్లో ఆయా జిల్లాల యంత్రాంగం మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవల సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించింది.

**బెల్లంపల్లిలో 45.4 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత**

గడిచిన శనివారం నమోదైన ఉష్ణోగ్రతల గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. తెలంగాణలోనే అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలో 45.4 డిగ్రీల సెల్సియస్ రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. దీనితో పాటు పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో 45.3 డిగ్రీలు, ములుగు జిల్లా మంగపేటలో 45.2 డిగ్రీలు, నిర్మల్ జిల్లా మామడలో 45.2 డిగ్రీలు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలంలో 45 డిగ్రీల సెల్సియస్ చొప్పున భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళల్లో నిప్పుల వాన కురిసినట్లు అనిపించడంతో జనం బయటకు రావడానికే వణికిపోతున్నారు.

**నిర్మానుష్యంగా మారుతున్న రహదారులు**

ఉష్ణోగ్రతలకు తోడు వేడి గాలులు ముంచెత్తుతుండటంతో సామాన్య ప్రజలు, ముఖ్యంగా రోజువారీ కూలీలు, వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎండ తీవ్రత మొదలవుతుండటంతో మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యాపార సముదాయాలు, మార్కెట్లు మధ్యాహ్నం పూట మూతపడుతున్నాయి. లారీల ప్రయాణాలు, బైక్ ప్రయాణాలు చేసే వారు వేడి గాలుల దెబ్బకు తీవ్రంగా అలసిపోతున్నారు. పల్లెల్లో సైతం ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు ఎండల తీవ్రతకు భయపడి ఉదయమే పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు.

**వడదెబ్బకు గురై 13 మంది మృత్యువాత**

రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన ఈ అసాధారణ ఎండల తీవ్రత శనివారం పెద్ద విషాదాన్ని మిగిల్చింది. వివిధ జిల్లాల్లో వడదెబ్బకు గురై మొత్తం 13 మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మృతుల్లో అత్యధికంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ఐదుగురు వడదెబ్బ కారణంగా కన్నుమూశారు. అలాగే కరీంనగర్ జిల్లాలో ముగ్గురు, నల్గొండ జిల్లాలో ముగ్గురు మరణించగా, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ఎక్కువ మంది పొలాల్లో పనులకు వెళ్లిన రైతులు, వృద్ధులే ఉండటం గమనార్హం. ఈ మరణాల నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లను అలర్ట్ చేసింది.

**ప్రజలకు నిపుణుల అత్యవసర సూచనలు**

ప్రస్తుత కఠిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరోగ్య నిపుణులు ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని స్పష్టం చేశారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలన్నారు. ఇందుకోసం తగినన్ని నీళ్లు తాగడంతో పాటు ఓఆర్ఎస్ ద్రావణం, ఇంట్లో తయారుచేసిన మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మరసం వంటి ద్రవాహారాలను నిరంతరం తీసుకుంటూ ఉండాలన్నారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు, టోపీలు, కాటన్ వస్త్రాలను ధరించడం, ముఖానికి రుమాలు కట్టుకోవడం తప్పనిసరి అని పేర్కొన్నారు.

**జూన్ 10 తర్వాతే నైరుతి రుతుపవనాల వర్షా లు**

ఎండలతో ఆందోళన చెందుతున్న ప్రజలకు నైరుతి రుతుపవనాల రాకపై వాతావరణ శాఖ కొంత ఉపశమనకరమైన, మరికొంత వేచిచూడాల్సిన అప్‌డేట్ ఇచ్చింది. శనివారం నాటికి అరేబియా మహాసముద్రంతో పాటు లక్షద్వీప్, ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతం ప్రాంతాల్లో నైరుతి రుతుపవనాలు చురుగ్గా, వేగంగా విస్తరించాయని అధికారులు తెలిపారు. రాబోయే ఐదు రోజుల్లో ఇవి కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలను తాకడానికి వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయన్నారు. అయితే కేరళను తాకిన తర్వాత అవి మన తెలంగాణ రాష్ట్రానికి చేరుకోవడానికి కొంత సమయం పడుతుంది. ప్రస్తుత అంచనాల ప్రకారం జూన్ 10వ తేదీ తర్వాతే రాష్ట్రంలో రుతుపవనాల ప్రభావంతో తొలి వర్షాలు కురుస్తాయని, అప్పటివరకు ఈ ఎండల తీవ్రతను, ఉక్కపోతను భరించక తప్పదని అధికారులు స్పష్టం చేశారు.

# రైతు డిస్కం పేరుతో కొత్త నాటకం

**మొదటిపేజీ తరువాయి**

సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పులు చేసినప్పటికీ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించిన కేటీఆర్, ఆ అప్పులతో రాష్ట్రానికి ఏం మేలు జరిగిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పనితీరుపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు.

# గండిపేటలో భూకబ్జా గుట్టురట్టు

**మొదటిపేజీ తరువాయి**

అడ్డుకున్నామని ఆయన పేర్కొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి కీలక పాత్ర**

ఈ వ్యవహారంలో వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడితో పాటు రమేష్ అనే వ్యక్తి పాత్రపై పక్కా ఆధారాలు లభించాయని డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గండిపేటలోని విలువైన ప్రభుత్వ భూమిని దక్కించుకోవడానికి బ్రహ్మనాయుడు క్రిమినల్ ముఠాలతో చేతులు కలిపినట్లు దర్యాప్తులో తేలింది. ప్రభుత్వ రికార్డులను మార్చడం, నకిలీ జీవోలను సృష్టించడం కోసం ప్రధాన నిందితుడైన రాధాకృష్ణ అనే వ్యక్తికి బొల్లా బ్రహ్మనాయుడు ఏకంగా రూ.4 కోట్లు నగదు రూపంలో ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డీల్‌కు సంబంధించిన కీలక ఆధారాలను దర్యాప్తు బృందం సేకరించింది.

**ఐఏఎస్ అధికారుల సంతకాలు ఫోర్జరీ**

ఈ ముఠా భూమిని కాజేయడానికి ఏకంగా ప్రభుత్వ ఉన్నతాధికారుల పేర్లనే వాడుకుంది. సదరు భూమిని క్రమబద్ధీకరించాలని (రెగ్యులరైజ్) కోరుతూ జిల్లా కలెక్టర్‌కు, అలాగే భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయానికి దస్త్రాలు వెళ్లినట్లు నకిలీ ఫైళ్లను సృష్టించారు. అంతటితో ఆగకుండా, కీలకమైన ఐఏఎస్ అధికారుల సంతకాలను హూబహూ ఫోర్జరీ చేసి, భూమిని కేటాయిస్తూ ఫేక్ ఆర్డర్లను తయారు చేశారు. మొదటి నుంచి ఈ భూమి చుట్టూ జరిగిన తప్పుడు ప్రక్రియకు సంబంధించిన అన్ని రకాల నకిలీ ఆర్డర్ కాపీలను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

**లాయర్ల బృందానికి రూ.4 కోట్ల ముడుపులు**

నకిలీ జీవోలు, తప్పుడు కోర్టు ఆర్డర్లు సృష్టించే ప్రక్రియలో కిలేడీ నిందితుడు రాధాకృష్ణకు ఒక లాయర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పూర్తిగా సహకరించినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ నకిలీ ఆర్డర్ల తయారీ కోసం సదరు లాయర్ బృందానికి మరో రూ.4 కోట్లు ఇచ్చినట్లు సమాచారం అందిందని డీసీపీ తెలిపారు. ఈ వ్యవహారంలో లబ్ధిదారులైన నిమ్మల కుటుంబం చెప్పిన విషయాలు, రాధాకృష్ణ వెల్లడించిన వివరాలు పూర్తిగా సరిపోలాయని చెప్పారు. ఈ లావాదేవీలన్నీ కేవలం నగదు (క్యాష్) రూపంలోనే జరిగినందున, ఆ డబ్బు ఎవరెవరికి వెళ్లిందనే విషయాలపై బ్యాంక్ ఖాతాలను, నిందితుల కదలికలను పోలీసులు ట్రాక్ చేస్తున్నారు.

**హైడ్రా ఆఫీసు క్లియరెన్స్ పేరిట నకిలీ పత్రాలు**

భూమికి ఎలాంటి లీగల్ సమస్యలు లేవని నమ్మించడానికి నిందితులు దారుణమైన ఫోర్జరీలకు పాల్పడ్డారు. సీసీఎల్ఏ ఆఫీసుతో పాటు, హైదరాబాద్‌లో చెరువులు, ప్రభుత్వ భూముల రక్షణ కోసం ఏర్పాటైన 'హైడ్రా' (HYDRAA) కార్యాలయం కూడా ఈ స్థలానికి ఎన్‌ఓసీ (క్లియరెన్స్) ఇచ్చినట్లు నకిలీ లేఖలను సృష్టించారు. ఫోర్జరీ సంతకాలు, నకిలీ స్టాంపులతో ఈ పత్రాలన్నీ తయారు చేశారు. ఈ కేసులో పోలీసులు విచారణ ప్రారంభించారనే విషయం తెలియగానే, ఆఫీసులో ఉన్న కీలకమైన ఒరిజినల్ ఫోర్జరీ పత్రాలను దాచిపెట్టాల్సిందిగా తన డ్రైవర్ ప్రవీణ్‌కు రాధాకృష్ణ ఫోన్ ద్వారా ఆదేశించాడు.

**పత్రాలు తరలిస్తుండగా డ్రైవర్ అరెస్ట్**

యజమాని ఆదేశాల మేరకు ఆఫీసు నుంచి నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపులను కార్లలో వేరే ప్రాంతానికి తరలించేందుకు డ్రైవర్ ప్రవీణ్ కుమార్ ప్రయత్నించాడు. అయితే అప్పటికే నిఘా ఉంచిన శేరిలింగంపల్లి పోలీసులు నిందితుడు ప్రవీణ్‌ను దారిలోనే అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న బ్యాగుల్లో తనిఖీ చేయగా భారీగా కుంభకోణానికి సంబంధించిన ఆధారాలు దొరికాయి. ఈ కేసులో ఏ9 నిందితుడిగా ఉన్న రాధాకృష్ణను, ఏ10గా ఉన్న డ్రైవర్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అధికారికంగా రిమాండ్‌కు తరలించారు.

**భారీగా నకిలీ స్టాంపులు, వస్తువులు స్వాధీనం**

అరెస్ట్ అయిన నిందితుల నివాసాలు, కార్యాలయాల నుంచి పోలీసులు పెద్ద ఎత్తున వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి భారీ సంఖ్యలో నకిలీ ప్రభుత్వ జీవో కాపీలు, 12 చెక్‌బుక్‌లు, 10 ఏటీఎం కార్డులు, 3 ల్యాప్‌టాప్‌లు, 2 మొబైల్ ఫోన్లు, 7 బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ప్రభుత్వ విభాగాలు, వివిధ రిజిస్ట్రేషన్ ఆఫీసుల పేరుతో నిందితులు సొంతంగా తయారు చేయించుకున్న 13 నకిలీ రబ్బర్ స్టాంపులను కూడా పోలీసులు స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

**పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు**

ప్రధాన నిందితుడు రాధాకృష్ణ ఒక ప్రొఫెషనల్ క్రిమినల్ అని, అతనిపై గతంలోనే వివిధ పోలీస్ స్టేషన్లలో 9 భూకబ్జా కేసులు నమోదయ్యాయని డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. అతని నివాసంలో జరిపిన సోదాల్లో కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన విలువైన స్థలాల పత్రాలు కూడా లభించాయని, అక్కడ కూడా నకిలీ సంస్థలను సృష్టించి మోసాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. ఈ రూ.1500 కోట్ల గండిపేట భూకబ్జా కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్టు చేశామని, ఈ ముఠాలో ఉన్న మరో ఐదుగురిని పట్టుకోవాల్సి ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడితో పాటు పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయని డీసీపీ వివరించారు.

# రైతు డిస్కం వెనుక ప్రైవేటీకరణ కుట్ర

**మొదటిపేజీ తరువాయి**




మీటర్లు బిగించబోమని ముఖ్యమంత్రి చెబుతున్నారని పేర్కొన్న కవిత.. ఆ విషయాన్ని మీడియా చిట్‌చాట్‌లలో కాకుండా అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల్లో ఉన్న అనుమానాలను ప్రభుత్వం నివృత్తి చేయాలని సూచించారు.

రైతు డిస్కం ఏర్పాటు వెనుక మిగిలిన రెండు విద్యుత్ డిస్కంలను ప్రైవేటీకరించే కుట్ర దాగి ఉందని ఆరోపించారు. ఈ ప్రయత్నాలను అడ్డుకునేందుకు అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త సోలార్ జీవో బడా కార్పొరేట్ సంస్థలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉందని కవిత విమర్శించారు. రైతులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విధానాలు రూపొందించాలని కోరారు.

ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా 18 రోజుల పసికందు చేయి కోల్పోయిన ఘటన అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి, ఖమ్మం జిల్లా మంత్రులు బాధ్యత వహించాలని, బాధిత చిన్నారి పేరిట రూ.25 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును దసరా నాటికి ప్రతిపాదించకపోతే పాదయాత్ర చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం పోరాటం కొనసాగిస్తామని కవిత స్పష్టం చేశారు.


# ఆత్మకమిటీ డైరెక్టర్ సందుల రవికి ఘన సన్మానం

**బీర్కూర్, మే 31(డిడి9 వార్త):** మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఆత్మ) కమిటీ డైరెక్టర్ సందుల రవికి శనివారం గ్రామ కాంగ్రెస్ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు. నిగర్వి స్వభావంతో, చిరునవ్వుతో అందరినీ ఆప్యాయంగా పలకరించే సందుల రవికి ఇటీవల ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా బాధ్యతలు దక్కిన సందర్భంగా ఈ సన్మానం చేపట్టారు.ఈ సందర్భంగా సందుల రవి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా నియమించిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బాన్సువాడ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు కాసుల రోహిత్లకు కృతజ్ఞతలు తెలిపారు. బరంగ్ ఏడ్గి గ్రామ రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గోండ్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కాదేపురం గంగన్న, హొక్నారి అశోక్, ఇందూర్ గజేందర్, బోయి లాలయ్య, కుమ్మరి గంగారాం, గాజుల పండరి, మేత్రి నాగుగౌండ, పుల్కంటి హన్మగౌండ, నీరడి రాములు, జంగం బసలింగప్ప, హట్కారి దశరథ్, బోయి సాయిలు, గూడెం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు



# ఎండలపై అప్రమత్తంగా ఉండాలి

**మొదటిపేజీ తరువాయి**



అంశాలతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్న ప్రధాని.. ఈ రోజు కార్యక్రమంలో ప్రధానంగా దేశవ్యాప్తంగా అల్లాడిస్తున్న ఎండల తీవ్రతపై మరియు యువ క్రీడాకారుల ప్రతిభపై ఫోకస్ పెట్టారు.

**తీవ్రమైన ఎండలపై ప్రధాని మోదీ ఆందోళన**

ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అసాధారణంగా పెరుగుతుండటంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. తీవ్రమైన ఉష్ణోగ్రతలు మరియు వడగాలుల పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన దేశ ప్రజలను కోరారు. వడగాలుల వల్ల తలెత్తే ఆరోగ్య ప్రమాదాల గురించి హెచ్చరిస్తూ.. వేడి సంబంధిత అనారోగ్యాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఆయన ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

**వడగాల్పుల నుండి రక్షణకు మార్గదర్శకాలు**

ఎండల నుండి తమను తాము రక్షించుకోవడానికి ప్రజలు పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన మార్గదర్శకాలను ప్రధానమంత్రి పంచుకున్నారు. అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సి వస్తే ఖచ్చితంగా తాగునీటిని వెంట ఉంచుకోవాలని ప్రజలకు మరోసారి సూచించారు. శరీరంలో నీటి శాతం తగ్గిపోకుండా చూసుకోవడం ద్వారానే వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే సమయంలో అనవసరంగా బయట తిరగవద్దని ప్రజలను కోరారు.

**ప్రాంతీయ సాంప్రదాయ పానీయాల ప్రాధాన్యత**

వివిధ రాష్ట్రాల్లో ఎండల నుంచి ఉపశమనం కోసం ప్రజలు తీసుకునే సాంప్రదాయ పానీయాల గురించి ప్రధాని మోదీ ఆసక్తికరంగా ప్రస్తావించారు. కృత్రిమ పానీయాల కంటే ప్రకృతిసిద్ధంగా లభించే ఆహారానికే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేడిని తట్టుకోవడానికి మన ఇళ్లలో లభించే మజ్జిగ, రకరకాల షర్బత్‌లు, కొబ్బరినీళ్లు, ఇతర స్థానిక పానీయాలను ఎక్కువగా తాగాలని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని దేశ ప్రజలకు సూచించారు.

**జాతీయ అథ్లెటిక్స్‌లో రికార్డుల పండగ**

భారతదేశ క్రీడా ప్రతిభను ప్రశంసిస్తూ.. మన యువ క్రీడాకారులు అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో అద్భుతమైన ప్రదర్శనలు చేసి దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నారని ప్రధాని మోదీ కొనియాడారు. ఇటీవల జార్ఖండ్‌లోని రాంచీలో జరిగిన జాతీయ సీనియర్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ పోటీలను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పోటీల్లో మన అథ్లెట్లు అసాధారణ ప్రతిభ కనబరిచి, నాలుగు విభిన్న విభాగాల్లో జాతీయ రికార్డులను బద్దలు కొట్టారని ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు.

**100 మీటర్ల పరుగులో అద్భుత ఘనత**

అథ్లెటిక్స్ పోటీల్లో క్రీడాకారులు గురిందర్‌వీర్ సింగ్, విశాల్ టీకే, తేజస్విన్ శంకర్, దేవ్ మీనా, కుల్దీప్ కుమార్‌లు సాధించిన కొత్త మైలురాళ్లను ప్రధాని అభినందించారు. ముఖ్యంగా 100 మీటర్ల స్ప్రింట్‌లో కేవలం రెండు రోజుల్లోనే జాతీయ రికార్డు మూడుసార్లు బద్దలైన అద్భుతమైన ఘనతను మోదీ వివరించారు. గురిందర్‌వీర్ సింగ్, అనిమేష్ కుజుర్‌ల పరుగు వేగాన్ని మెచ్చుకుంటూ, ఈ ఇద్దరు అథ్లెట్లు తమ పరుగు పందెం అనుభవాలను ప్రధానితో పంచుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి విజయాలు భారత అథ్లెటిక్స్ పెరుగుతున్న బలానికి నిదర్శనమన్నారు.

**కేరళ స్విమ్మింగ్ క్లబ్ సేవలపై ప్రశంసలు**

క్రీడలను ప్రోత్సహించడంతో పాటు సామాజిక సేవ చేస్తున్న సంస్థలను ప్రధాని మోదీ ఎప్పుడూ గుర్తిస్తూనే ఉంటారు. ఈ క్రమంలోనే కేరళలోని ఆలువా ప్రాంతంలో సేవలు అందిస్తున్న ఒక ప్రముఖ స్విమ్మింగ్ క్లబ్‌ను ఆయన ప్రశంసించారు. ఇప్పటివరకు దాదాపు 15 వేల మంది ఈత ఔత్సాహికులకు ఈ క్లబ్ నిర్వాహకులు ఎటువంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా ఈత నేర్పించారని కొనియాడారు. ఇటువంటి క్లబ్‌ల వల్ల యువతలో నైపుణ్యాలు పెరగడమ...

# ఆదిలాబాద్ రిమ్స్‌లో మెరుగైన వైద్య సేవలు
# ప్రజల్లో పెరుగుతున్న నమ్మకం

**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో:డిడి9 వార్త న్యూస్**

ఆదిలాబాద్ జిల్లాలోని రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆసుపత్రి ఇటీవలి కాలంలో వైద్య సేవల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధితో ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ఒకప్పుడు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, నాగ్‌పూర్ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చిన రోగులు ప్రస్తుతం రిమ్స్‌లోనే అనేక ప్రత్యేక వైద్య సేవలను పొందుతున్నారు. డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆసుపత్రిలో పలు మార్పులు చోటుచేసుకున్నాయని ఆసుపత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, ప్రత్యేక విభాగాల బలోపేతం, అత్యవసర వైద్య సేవల విస్తరణ వంటి చర్యలు చేపట్టినట్లు సమాచారం. గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. గతంలో ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితులు కొంత మేర తగ్గాయని రోగులు చెబుతున్నారు.ఆసుపత్రిలో పరిశుభ్రత, సమయానికి పరీక్షలు, నిపుణులైన వైద్యుల సేవలు, అవసరమైన మందుల లభ్యత వంటి అంశాలు రోగుల సంతృప్తిని పెంచుతున్నాయి. దీంతో ఆదిలాబాద్ జిల్లాతో పాటు నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల తదితర జిల్లాల నుంచి కూడా రోగులు



రిమ్స్‌ను ఆశ్రయిస్తున్నట్లు తెలుస్తోంది. వైద్య సేవలతో పాటు వైద్య విద్యాభివృద్ధిపైనా ఆసుపత్రి యాజమాన్యం దృష్టి సారిస్తోంది. వైద్య విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ, వైద్య సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ప్రజారోగ్య సేవలను మరింత మెరుగుపర్చే లక్ష్యంతో ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమాలుకొనసాగుతున్నాయని డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్ తెలిపారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడంలో రిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో రాష్ట్రంలో ఆదర్శ ప్రభుత్వ వైద్య సంస్థగా ఎదగాలనే లక్ష్యంతో రిమ్స్ ముందుకు సాగుతోంది.











# పొగాకు రహిత జీవనమే ఆరోగ్యం, ఆర్థిక భద్రత

- **నిజామాబాద్‌లో ప్రతిజ్ఞ చేసిన వైద్య సిబ్బంది**

**నిజామాబాద్ జిల్లా, మే 31(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ ఆదేశాల మేరకు, ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గౌతం నగర్ యూపీహెచ్‌సీ కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సికిందర్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని, ఏడు యూపీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పొగాకు రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సికిందర్ నాయక్ మాట్లాడుతూ... పొగాకు ఉత్పత్తులైన సిగరెట్లు, బీడీలు, గుట్కా, ఖైనీ, జర్దా వంటి వాటి వినియోగం వల్ల నోరు, గొంతు, ఊపిరితిత్తులు మరియు ఆహార నాళం వంటి శరీర భాగాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అంతేకాకుండా గుండెపోటు, పక్షవాతం, అధిక రక్తపోటు మరియు మధుమేహం వంటి ప్రాణాంతక వ్యాధులు పొంచి ఉన్నాయని ఆయన వివరించారు. చిన్న వయసులో సరదాగా ప్రారంభమయ్యే అలవాట్లు క్రమంగా వ్యసనంగా మారి, యువత భవితను దహించివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన కీలక సూచనలు చేస్తూ, పొగాకు ఉత్పత్తుల నియంత్రణ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు వారికి పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమని, విద్యాసంస్థల 100 గజాల పరిధిలో ఎటువంటి పొగాకు పదార్థాలు అమ్మకూడదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాలైన బస్టాండ్లు, సినిమా థియేటర్లు మరియు వ్యాపార సముదాయాలలో ధూమపానం నిషేధమని గుర్తు చేశారు. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా పాఠశాలల్లో విద్యార్థులకు పొగాకు వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకన్న, పీఓఎంసీహెచ్ డాక్టర్ శిఖర, డీఎస్ఓ డాక్టర్ వెంకటేష్, డిస్ట్రిక్ట్ ఎపిడెమియాలజిస్ట్ డాక్టర్ శ్రావ్య, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ పి.వెంకటేష్‌తో పాటు ఫార్మసిస్టులు, ఎంపీహెచ్ఈఓలు, ఎంపీహెచ్ఎస్‌లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో జూన్ 15 వరకు సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలు

**నిజామాబాద్ జిల్లా, మే 31(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల సౌకర్యం దృష్ట్యా జూన్ 1వ తేదీ నుండి జూన్ 15వ తేదీ వరకు కఠిన నిబంధనలను అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య వెల్లడించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జన సమ్మర్థం ఉన్న ప్రాంతాలు, పార్కులు మరియు ప్రభుత్వ భవనాల వద్ద ఎటువంటి విగ్రహాల ప్రతిష్టాపనలు చేపట్టకూడదు, ఒకవేళ ఏర్పాటు చేయాలనుకుంటే జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. శబ్ద కాలుష్య నియంత్రణలో భాగంగా రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డీజేలు, సౌండ్ సిస్టమ్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. ఏదైనా సభలు, సమావేశాలు లేదా ఊరేగింపులు నిర్వహించాలనుకుంటే 500 మంది వరకు అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ అనుమతిని, అంతకంటే ఎక్కువ మంది అయితే 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ అనుమతిని పొందాల్సి ఉంటుంది. సార్వజనిక ప్రదేశాలైన మాల్స్, సినిమా థియేటర్లు, హోటళ్ల వద్ద క్యూ పద్ధతిని పాటించడంతో పాటు సెక్యూరిటీ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలి. 'ఏ' సర్టిఫికెట్ కలిగిన చిత్రాలను మైనర్లు వీక్షించేందుకు అనుమతించరాదని థియేటర్ యాజమాన్యాలను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల మహిళలు, పిల్లలకు ఇబ్బందులు



ఎదురవుతున్న దృష్ట్యా, బహిరంగ మద్యం సేవనాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. ప్రజా భద్రత మరియు శాంతిభద్రతల దృష్ట్యా డ్రోన్ల వినియోగంపై ఆంక్షలు విధించారు; ఎవరైనా డ్రోన్లను ఉపయోగించాలనుకుంటే సంబంధిత పోలీసు మరియు ఏవియేషన్ అధికారుల నుండి ముందస్తు క్లియరెన్స్ తీసుకోవాలి.నకిలీ గల్ఫ్ ఏజెంట్ల విషయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. ఉపాధి అవకాశాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న నకిలీ ఏజెంట్లకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని, అటువంటి వ్యక్తుల వివరాలను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. పైన పేర్కొన్న నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ నిబంధనల అమలులో ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని కమిషనర్ కోరారు.

# భీంగల్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మాదిగ విద్యార్థులకు సన్మానం

**నిజామాబాద్ జిల్లా, మే 31(డీడీ9 వార్త) :**

భీంగల్ మండల కేంద్రంలో మాదిగ ఐక్యవేదిక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 150 మంది మాదిగ విద్యార్థులను గుర్తించి, వారిని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డాక్టర్ సూర్జిల్ బాబు, డాక్టర్ రాజ్ కుమార్ మరియు డాక్టర్ పోచన్న తమ చేతుల మీదుగా విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి అతిథులు మాట్లాడుతూ, పట్టుదలతో చదువుకుంటే సమాజంలో ఏదైనా సాధించడం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విద్యార్థులు మహాత్మా జ్యోతిరావు పూలే మరియు బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రయాణిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ విలువైన సూచనలు అందించారు.

ఈ కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షుడు గడలా ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ సంతి లత, జై జై నర్సన్న, చెప్పాలా గణేష్, చెంగల్ సర్పంచ్ రాజు, జి. రాజేశ్వర్, టి. అశోక్, దశరథ్, చౌదరి, యోనా, రతన్, రాజేందర్, సాయిబాబా, ముత్యన్న, సుదర్శన్, వివిధ మాదిగ సంఘాల పెద్దలు, విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# బషీరాబాద్ లో బాస వేణుగోపాల్ యాదవ్‌కు సన్మానం

**నిజామాబాద్ జిల్లా, మే 31(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ గ్రామంలో ఆదివారం నాడు రాష్ట్ర పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మెంబర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బాస వేణుగోపాల్ యాదవ్‌ను గ్రామ పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ జమున మహేష్, ఉప సర్పంచ్ చిలివేరి భూమేశ్వర్ నేతృత్వంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో వార్డు సభ్యులు నెల్ల రమేష్, బందెల రాజు, అంకడి శేఖర్, దొంపాల్ రవి, స్థానిక నాయకులు ఏనుగు గంగారెడ్డి, నర్రా భూమేశ్వర్, బైకని ముకేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో పాటు మురళి, నారాయణ, సుమన్, దేవేందర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేణుగోపాల్ యాదవ్‌ను అభినందించారు.

# ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రత

**నిజామాబాద్ జిల్లా, మే 31(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ జిల్లాలో జూన్ 5వ తేదీ నుండి 12వ తేదీ వరకు జరగనున్న సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య వెల్లడించిన వివరాల ప్రకారం నిజామాబాద్‌లోని ఆదర్శ మహిళా విద్యాలయం, ఆర్మూరులోని జెడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్, బోధన్‌లోని గర్ల్స్ హై స్కూల్ మరియు జూనియర్ కాలేజీల వద్ద పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కేంద్రాల పరిసరాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా చేరడాన్ని నిషేధించారు. పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు కేంద్రాలకు సమీపంలో ఉన్న ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు మరియు స్టేషనరీ దుకాణాలను ఆ సమయంలో తప్పనిసరిగా మూసివేయాలని యజమానులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రతి కేంద్రం వద్ద పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడమే కాకుండా, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచుతున్నామని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

# ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

**బోధన్,నిజామాబాద్ జిల్లా,మే 31(డీడీ9వార్త):**



వర్ని మండలం కోటయ్య క్యాంపుకు చెందిన భూమేష్ అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. శనివారం సాయంత్రం రుద్రూర్ మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. సిమెంట్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి బోల్తా పడటంతో భూమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో పోలీసులు, 108 సిబ్బంది అక్కడికి చేరుకుని బాధితుడిని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో కూడా ఆర్టీసీ బస్సు, లారీ, టిప్పర్ వంటి వాహనాలు ప్రమాదాలకు గురైనట్లు వారు పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని మరియు భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బోధన్ ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**బోధన్, నిజామాబాద్, మే 31(డీడీ9 వార్త) :**

బోధన్ ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సంజీవ్, రీజినల్ ప్రధాన కార్యదర్శి సాయిలు, రీజినల్ మెంబర్ దశరథ్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో డిపో అధ్యక్షుడిగా హనీఫుద్దిన్, ప్రధాన కార్యదర్శిగా జి.ఎన్. గౌడ్, కోశాధికారిగా ఎం. గంగారాం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి. పోతారెడ్డి, గ్యారేజ్ కార్యదర్శిగా సురేష్, మహిళా అధ్యక్షురాలిగా డి. కమల, మహిళా కార్యదర్శిగా బి.ఎ. రాణిలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన జి.ఎన్. గౌడ్ మాట్లాడుతూ, కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమిస్తానని, యాజమాన్యంతో సమన్వయం చేసుకుంటూ కార్మికుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.




# ఘనంగా శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం





**(డీడీ9 వార్త)మేడ్చల్:**
మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీ గార్డెన్ లో విష్ణు శౌర్య ఆధ్వర్యంలో వేద పండితులచే శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్స వం కన్నుల పండువగా నిర్వహిం చారు. ఈ కళ్యాణ మహోత్సవం లో అధిక సంఖ్యలో దంప తులు పాల్గొని సంప్రదాయ పద్ధతిలో పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్స వానికి ముఖ్య అధితులుగా బి అర్ ఎస్ పార్టీ ఇంచార్జి మహేందర్ రెడ్డిని ,మాజీ ఎఫ్డిసి చైర్మన్ ప్రతాప్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంద ర్భంగా అధితులను విష్ణు శౌర్య శాలువలతో సన్మానించి సత్క రించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేసిన సందర్భంగా విష్ణు శౌర్య మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నిర్వ హించే కల్యాణ మహోత్సవానికి విచ్చేస్తున్న భకు _లందరికి ధన్యవాదాలు తెలుపుతూ స్వామి వారి ఆశీ స్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.






## మురికివాడల అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలి : సీపీఐ డిమాండ్

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 31(డీడీ9 వార్త) :**
వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణం లోని మురికివాడల్లో రహదారులు, మురికి కాలువల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, పట్టణ కార్యదర్శి రాధాకృష్ణన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఒకటో వార్డు ఆటోనగర్‌లో సిపిఐ సీనియర్ నాయకులు నాగళ్ళ హనుమంతరావు అధ్యక్ష తన జరిగిన సమావేశంలో వారు ముఖ్య అతి థులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పట్టణంలోని పలు వార్డుల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దుర్గంధంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మురికి కాలువల నిర్మాణం చేపట్టడంతో పాటు త్రాగునీటి సరఫరా, వీధిలైట్ల సౌకర్యాలను కల్పించాలని నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను కోరారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు మురికివాడల సమీపంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సీపీఐలో పలువురు చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఒకటో వార్డు నూతన కమిటీని ఎన్నుకున్నారు. వార్డు కార్యదర్శిగా సంతోష్, సహాయ కార్యదర్శిగా లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బోధన్ మండల నాయకులు సాయిలు, రామ కృష్ణ, పట్టణ నాయకులు కృష్ణ, సలీం, మన్నన్, పార్టీలో కొత్తగా చేరిన ఆలీ, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్‌పీపై రైతుల ఆగ్రహం

- **జీవో కాపీలతో నిరసన**

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 31(డీడీ9 వార్త) :**
కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా, సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని అఖిల భారత ఐక్య రైతు సంఘం కార్యాల యం వద్ద ఎంఎస్‌పీ (కనీస మద్దతు ధర) ఆర్డర్ కాపీలను దగ్గం చేశారు.bఈ సంద ర్భంగా అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరలు రైతులకు ఏమాత్రం లాభదా యకంగా లేవని విమర్శించారు. ప్రభుత్వం ధరల కమిషన్ పేరుతో చేస్తున్న ప్రకటనలు వాస్తవ దూరమని, రైతులు పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడిని కనీసం పరిగణ నలోకి తీసుకోవడం లేదని మండిపడ్డారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం సి2+50 శాతం లాభం కల్పించాల్సి ఉండగా, నామమాత్రపు ఖర్చులను మాత్రమే లెక్కలోకి తీసుకుంటూ ఎంఎస్‌పీ నిర్ణయించడం దుర్మా ర్గమని పేర్కొన్నారు. రైతుల పట్ల ద్రోహం చేస్తు న్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కా ర్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం మండల నాయకులు సుదర్శన్, కాశ, రవి, అనుమల్లు, ఇందూర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## తగ్గెల్లిలో ఘనంగా అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 31(డీడీ9 వార్త) :**
సాలూర మండలం తగ్గెల్లి గ్రామంలో ఆదివారం కురుమ సంఘం ఆధ్వర్యంలో పుణ్యశ్లోక మహారాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అహల్యాబాయి హోల్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ ... అహల్యాబాయి హోల్కర్ ధర్మపరాయణురాలని, ప్రజాహిత పాలన అందించిన గొప్ప పాలకురాలని కొనియాడారు. తన పాలనా కాలంలో ప్రజల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని, దేశ వ్యాప్తంగా అనేక ఆలయాలు, ఘాట్లు, ధర్మశాలలను నిర్మించి ఆధ్యాత్మిక మరియు సామాజిక సేవలో తనదైన ముద్ర వేశారని గుర్తు చేశారు. ఆమె ఆదర్శవంతమైన జీవితం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. జయంతి వేడుకల అనంతరం గ్రామస్థుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తగ్గెల్లి సర్పంచ్ అరుణ బాయ్, బోధన్ కురుమ సంఘం నాయకులు రావుభ గంగాధర్, దేవూరావు, మేడి రవి, చంద్రకాంత్, వీరేష్, రాజు, మహేష్, బాలాజీ, బజరంగ్, నిఖిల్, ప్రభాకర్, సదానంద్, రినేష్, గంగాధర్, దేవేందర్, సదానంద్, వెంకట్, బీరయ్య, సాయిలు, మక్కుగొండ సాయిగొండ తదితరులు పాల్గొన్నారు.



# ఐపీఎల్ 2026 ఫైనల్‌పై అశ్విన్ జోస్యం.. ఈసారి టైటిల్ ఆ జట్టుదేనట!

- ఐపీఎల్ 2026 ఫైనల్‌లో ఆర్సీబీనే హాట్ ఫేవరెట్ అని అశ్విన్ జోస్యం
- ఈ ఫైనల్ లో గెలుపోటములు పూర్తిగా ఆర్సీబీ చేతుల్లోనే ఉన్నాయని వ్యాఖ్య
- క్వాలిఫయర్-1లో గుజరాత్‌ను ఆర్సీబీ 92 పరుగుల తేడాతో చిత్తు చేసిన వైనం
- అహ్మదాబాద్‌లో ఆడటం గుజరాత్‌కు కలిసొచ్చే కీలక అంశం
- వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని చూస్తున్న ఆర్సీబీ

ఐపీఎల్ 2026 సీజన్ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనున్న ఈ తుది పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), గుజరాత్ టైటాన్స్ (జీటీ) తలపడనున్నాయి. అయితే, ఈ కీలక మ్యాచ్‌లో ఆర్సీబీ జట్టే హాట్ ఫేవరెట్ అని, కప్పు గెలవడానికి వారికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

"ఆర్సీబీ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేస్తుందా లేదా బౌలింగ్ చేస్తుందా అనేదానితో సంబంధం లేదు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపోటములు పూర్తిగా వారి చేతుల్లోనే ఉన్నాయి. వారు హాట్ ఫేవరెట్స్‌గా బరిలోకి దిగుతున్నారు. వారు ఏ నిర్ణయం తీసుకున్నా సరే... ఈ సీజన్ పొడవునా వారు ప్రదర్శించిన దూకుడును ఏమాత్రం తగ్గించకూడదు, వెనకడుగు వేయనేకూడదు" అని స్పష్టం చేశాడు.

ధర్మశాలలో మే 26న జరిగిన క్వాలిఫయర్1 మ్యాచ్‌లో ఆర్సీబీ 92 పరుగుల భారీ తేడాతో గుజరాత్‌ను చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కెప్టెన్ రజత్ పటీదార్ (33 బంతుల్లో 93 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఆర్సీబీ 254/5 పరుగుల భారీ స్కోరు చేయగా, గుజరాత్ 162 పరుగులకే కుప్పకూలింది. అయితే, మే 29న జరిగిన క్వాలిఫయర్2లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో గెలిచి గుజరాత్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అశ్విన్ మాట్లాడుతూ.. "ఆర్సీబీ బ్యాటింగ్ చేసినా, బౌలింగ్ చేసినా ఫర్వాలేదు. వారు తమ దూకుడైన ఆటతీరును కొనసాగించాలి తప్ప, వెనక్కి తగ్గకూడదు" అని సూచించాడు. అయితే, గుజరాత్‌కు సొంతగడ్డపై ఆడటం అతిపెద్ద అడ్వాంటేజ్ అని పేర్కొన్నాడు. "నరేంద్ర మోదీ స్టేడియం పిచ్‌పై గుజరాత్‌కు మంచి పట్టుంది. ఇది వారికి అదనపు బలాన్నిస్తుంది" అని విశ్లేషించాడు. గత ఏడాది ఛాంపియన్‌గా నిలిచిన ఆర్సీబీ, ఈ సీజన్‌లోనూ అద్భుత ఫామ్‌తో లీగ్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఈసారి కూడా టైటిల్ గెలిచి చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ తర్వాత వరుసగా రెండుసార్లు కప్పు గెలిచిన మూడో జట్టుగా చరిత్ర సృష్టించాలని పట్టుదలగా ఉంది. మరోవైపు 2022 విజేత అయిన గుజరాత్ టైటాన్స్ కూడా ఈ సీజన్‌లో నిలకడైన ప్రదర్శన కనబరిచింది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో సొంత ప్రేక్షకుల మధ్య ఫైనల్ ఆడనుండటం వారికి కలిసొచ్చే అంశం. ఒకవైపు విరాట్ కోహ్లీ వంటి స్టార్లతో నిండిన ఆర్సీబీ బ్యాటింగ్ లైనప్, మరోవైపు రషీద్ ఖాన్, రబాడ వంటి బౌలర్లతో పటిష్ఠంగా ఉన్న గుజరాత్ బౌలింగ్ విభాగం మధ్య ఈ పోరు హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.






# ఐపీఎల్ లో ఈ మూడు రూల్స్ మార్చండి - సచిన్

**డిడి9 వార్త:**
ఐపీఎల్ 2026 ముగుస్తున్న నేపథ్యంలో సచిన్ టెండూల్కర్ కీలక సూచనలు చేశారు. ఐపీఎల్ మరింత ఆసక్తికరంగా మారాలంటే మూడు రూల్స్ మార్చాలని ఆయన వెల్లడించారు. తాజాగా జరిగిన ఓ ఈవెంట్ లో సచిన్ టెండుల్కర్ మాట్లాడుతూ... ఐపీఎల్ లో ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ పూర్తిగా తొలగించాల్సిందేనని కీలక సూచనలు చేశారు. ప్రతి మ్యాచ్ లో ఒక్క బౌలర్ 5 ఓవర్లు వేసేలా రూల్స్ మార్చాలని పేర్కొన్నారు. మిగిలిన బౌలర్లు ఎప్పటిలాగే నాలుగు ఓవర్లు వేయాలన్నారు. ఇప్పటి వరకు ఆరు ఓవర్లు బ్యాటర్లకు అనుకూలంగా పవర్ ప్లే ఉందన్న సంగతి తెలిసిందే. అయితే దాన్ని రెండు భాగాలుగా డివైడ్ చేయాలని కోరారు సచిన్. మొదటి నాలుగు ఓవర్లు బ్యాటింగ్ పవర్ ప్లేగా కొనసాగించాలని సూచనలు చేశారు. మిగిలిన రెండు ఓవర్లు బౌలర్లకు అనుకూలంగా మలచాలని స్పష్టం చేశారు. బౌలింగ్ పవర్ ప్లేలో ఒక ఫీల్డర్ ను 30 యాడ్స్ బయట పెట్టుకునేలా అవకాశం కల్పించాలన్నారు. ఈ మూడు రూల్స్ వచ్చే సీజన్ నుంచి అమలు చేస్తే, ఐపీఎల్ కు మరింత ఆదరణ పెరుగుతుందని వెల్లడించారు.



# మరి కొన్నిరోజుల్లో ఫిఫా వరల్డ్ కప్... భారత్‌లో ప్రసారాలపై ఇంకా వీడని అనిశ్చితి

- మరికొన్ని రోజుల్లో ఫిఫా వరల్డ్ కప్, ప్రసారాలపై వీడని ఉత్కంఠ
- ప్రసార హక్కుల రేసులో జీ నెట్‌వర్క్ ముందంజ
- భారీ ధర, అనుకూలించని మ్యాచ్ సమయాలతో చర్చల్లో జాప్యం
- ఒప్పందం కుదిరితే జీ స్పోర్ట్స్, జీ5లో అన్ని మ్యాచ్‌ల ప్రసారం
- జియోస్టార్ ఆఫర్‌ను తిరస్కరించిన ఫిఫా




**డిడి9 వార్త:**
ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ 2026 ప్రారంభానికి కొద్ది రోజులే ఉన్నా, భారత్‌లో ప్రసారాలపై ఇంకా సందిగ్ధత వీడలేదు. జూన్ 11న మెగా టోర్నీ మొదలుకానుండగా, ఏ ఛానెల్‌లో మ్యాచ్‌లు వస్తాయో తెలియక కోట్లాది మంది అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అయితే, చివరి నిమిషంలో ఈ ఉత్కంఠకు తెర పడనున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ 'జీ' నెట్‌వర్క్ ప్రసార హక్కులను దక్కించుకునేందుకు గట్టిగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం.

దాదాపు 3035 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 250290 కోట్లు) ఒప్పందంతో జీ నెట్‌వర్క్ ఈ హక్కులను సొంతం చేసుకునే అవకాశాలున్నాయి. ఒప్పందం ఖరారైతే, టోర్నీలోని మొత్తం 104 మ్యాచ్‌లను జీ స్పోర్ట్స్ ఛానెళ్లలో, అలాగే జీ5 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో బహుళ భాషల కామెంటరీతో ప్రసారం చేయనున్నారు. అతి త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని భావిస్తున్నారు.

ఈసారి ప్రసార హక్కుల విషయంలో జాప్యం జరగడానికి ప్రధాన కారణం ఫిఫా మొదట అధిక ధర డిమాండ్ చేయడమే. 2026, 2030 సీజన్లకు కలిపి దాదాపు 100 మిలియన్ డాలర్లు ఆశించడంతో బ్రాడ్‌కాస్టర్లు వెనకడుగు వేశారు. దీనికి తోడు, భారత్‌లోని వీక్షకులకు మ్యాచ్ సమయాలు అనుకూలంగా లేకపోవడం మరో ప్రతికూలాంశంగా మారింది. చాలా మ్యాచ్‌లు అర్ధరాత్రి, తెల్లవారుజామున జరగనున్నాయి. మొత్తం 104 మ్యాచ్‌లలో కేవలం 14 మాత్రమే భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రిలోపు ప్రారంభం కానున్నాయి. ఫైనల్ మ్యాచ్ సైతం అర్ధరాత్రి దాటాక 12:30 గంటలకు జరగనుంది. ఈ కారణాలతో జియోస్టార్ కేవలం 20 మిలియన్ డాలర్ల ప్రతిపాదనను ఫిఫా ముందుంచింది. అయితే ఈ ఆఫర్‌ను ఫిఫా తిరస్కరించింది.

భారత జట్టు ప్రపంచకప్‌కు అర్హత సాధించకపోయినా, ఇక్కడ ఫుట్‌బాల్‌కు విపరీతమైన ఆదరణ ఉంది. 2022లో ఖతార్‌లో జరిగిన ప్రపంచకప్‌ను భారత్‌లో 110 మిలియన్ల మంది డిజిటల్ మాధ్యమాల్లో వీక్షించారు. ఇది ఫిఫా ప్రపంచ వీక్షకుల్లో 2.9 శాతం కావడం విశేషం. ఏదేమైనా, ఆలస్యమైనప్పటికీ అభిమానులకు ప్రపంచకప్ మ్యాచ్‌లను చూసే అవకాశం లభించడం ఖాయంగానే కనిపిస్తోంది.

# సింగపూర్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ చరిత్ర... ఫైనల్లో అద్భుత విజయంతో టైటిల్ కైవసం

- సింగపూర్ ఓపెన్ మెన్స్ డబుల్స్ టైటిల్ గెలిచిన సాత్విక్-చిరాగ్
- ఈ ఘనత సాధించిన తొలి భారత జోడీగా చారిత్రక విజయం
- ఫైనల్లో ఇండోనేషియా జోడీపై మూడు గేమ్‌ల పోరులో గెలుపు
- తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం
- రెండేళ్ల తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇదే తొలి టైటిల్

**డిడి9 వార్త:**
భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి చరిత్ర సృష్టించారు. సింగపూర్ ఓపెన్ మెన్స్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న తొలి భారత ద్వయంగా నిలిచారు. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకుని ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్, మహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ జోడీపై విజయం సాధించారు. గంటా 13 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో సాత్విక్‌చిరాగ్ జోడీ 1821, 2117, 2116 తేడాతో గెలుపొందింది.

ఈ విజయంతో సాత్విక్‌చిరాగ్ జోడీ రెండేళ్ల టైటిల్ నిరీక్షణకు తెరపడింది. 2024లో థాయ్‌లాండ్ ఓపెన్ గెలిచిన తర్వాత, ఈ జంట ఏకంగా నాలుగు ఫైనల్స్‌లో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ గెలుపు వారి కెరీర్‌లో తొమ్మిదో వరల్డ్ టూర్ టైటిల్ కాగా, మూడో సూపర్ 750 టైటిల్ కావడం విశేషం.

ప్రపంచ నాలుగో ర్యాంక్ జోడీ అయిన సాత్విక్‌చిరాగ్, ప్రపంచ మూడో ర్యాంక్ ఇండోనేషియా ద్వయంతో జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలో తడబడింది. తొలి గేమ్‌ను కోల్పోవడంతో ఒత్తిడి పెరిగింది. అయితే, రెండో గేమ్ నుంచి భారత జోడీ పూర్తిగా పుంజుకుంది. తమదైన దూకుడైన ఆటతీరు, పదునైన స్మాష్‌లతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసింది. రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను సమం చేయడమే కాకుండా, నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే ఆధిపత్యాన్ని కొనసాగించి చారిత్రక విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది.




విజయం ఖరారైన వెంటనే సాత్విక్, చిరాగ్ ఆనందంతో కోర్టుపైనే పడిపోయి భావోద్వేగంతో సంబరాలు చేసుకున్నారు. సుదీర్ఘకాలం తర్వాత టైటిల్ గెలిచిన ఆనందాన్ని ఆస్వాదిస్తూ కోర్టులో నృత్యం చేశారు. ఈ టోర్నీ సెమీఫైనల్లో ప్రపంచ ఛాంపియన్లను ఓడించి ఫైనల్‌కు చేరిన ఈ జంట, తుది పోరులోనూ అద్భుత ప్రదర్శనతో అభిమానులను అలరించింది.



# కిల్లర్ పాత్రలో ఆలియా భట్..




యష్ రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న 'స్పై యూనివర్స్' సినిమాల్లో 'ఆల్ఫా' ఒకటి. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో బాలీవుడ్ స్టార్ బ్యూటీ ఆలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఇదిలా ఉంటే.. 'ఆల్ఫా' చిత్రంలో ఆలియా పాత్రపై ఇంట్రెస్టింగ్ అప్డేట్ ఇప్పుడు నెట్టింట షాకింగ్‌గా వైరల్ అవుతున్నది. ఇప్పటి వరకు వచ్చిన ఈ సిరీస్ సినిమాల్లో హీరోహీరోయిన్స్ స్పై ఏజెంట్స్ కాగా.. ఇందులో మాత్రం అందుకు భిన్నంగా ఆలియాను ఓ పవర్ ఫుల్ ఆల్ఫా కిల్లర్‌గా చూపించబోతున్నట్లు తెలుస్తుంది. కేవలం ప్రత్యర్థులను అంతమొందించడానికి చిన్నప్పటి నుంచి ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఓ ప్రొఫెషనల్ హంతకురాలుగా నెగిటివ్ షేడ్స్‌లో యాంటీ-హీరో పాత్రలో ఆలియా నటిస్తుందటి బాలీవుడ్ వర్గాల నుంచి టాక్. అలాగే ఇందులో ఆమె చేసే భారీ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుయని, ఈ సినిమాతో ఆలియా తన కెరీర్‌లోనే బెస్ట్ సక్సెస్ అందుకుంటుంది ఇన్‌సైడ్ టాక్. కాగా.. 'ది రైల్వే మెన్' వెబ్ సిరీస్ ఫేమ్ శివ రవైల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శర్వారీ వాఘ్ మరో హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాబీ డియోల్, అనిల్ కపూర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ అంచనాల మధ్య ఈ చిత్రం జులై 10న రిలీజ్ చేయనున్నట్లు అనౌన్స్ చెయ్యగా.. ఓ వారం ముందుగా అంటే జులై 3న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతున్నదని తెలుస్తుంది.

## డబ్బులు ఇస్తున్నారు కాబట్టి విమర్శించే హక్కు ప్రేక్షకులకు ఉంది

బాలీవుడ్ యంగ్ బ్యూటీ త్రిప్తి డిమ్రి 'యానిమల్' సినిమాతో భారీ విజయాన్ని తన ఖాతాలో వేసుకుని విపరీతమైన క్రేజ్ రాబట్టుకుంది. ఆ తర్వాత నుంచి వైవిధ్యమైన పాత్రలు చేస్తూ తన నటనతో అందరినీ మంత్రముగ్దులను చేస్తోంది. టాలీవుడ్, బాలీవుడ్ ఇండస్ట్రీల్లో బ్యాక్ టు బ్యాక్ చాన్సులు పొందుతూ ఫుల్ ఫామ్‌లో ఉంది. ప్రస్తుతం రెబల్ స్టార్ ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న 'స్పిరిట్'లో త్రిప్తి హీరోయిన్‌గా నటిస్తూ.. ఫుల్ బిజీగా గడుపుతోంది. ఈక్రమంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న త్రిప్తి నటీనటులపై వచ్చే విమర్శల గురించి కొన్ని షాకింగ్ కామెంట్స్ చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. సినిమాలు విడుదలయ్యే సమయంలో నటీనటులకు ఉండే ఆందోళన గురించి త్రిప్తి మాట్లాడుతూ.. మనం ఏదైనా ఒక పని చేసి, దాని కోసం ఎంతో సమయం, శ్రమ వెచ్చించినప్పుడు అలాంటి భయం కలగడం చాలా సహజమని ఆమె చెప్పింది.

దీనికి ఉదాహరణగా స్కూల్‌లో ఎగ్జామ్స్ రాశాక రిజల్ట్స్ కోసం ఎదురుచూసేటప్పుడు ఎలాంటి ఫీలింగ్ ఉంటుందో, సినిమా రిలీజ్ అప్పుడు కూడా అలాగే ఉంటుందని వివరించింది. అయితే, మనం చేసిన పని గురించి జనాల మధ్య చర్చ జరగడం మంచిదేనని, అది పాజిటివ్ అయినా, నెగెటివ్ అయినా నటులుగా దాన్ని అంగీకరించాల్సిందేనని స్పష్టం చేసింది. ప్రేక్షకులు డబ్బులు పెట్టి మనల్ని స్క్రీన్‌పై చూడటానికి వస్తున్నారు కాబట్టి, మన నటనను విమర్శించే హక్కు వారికి ఖచ్చితంగా ఉంటుందని త్రిప్తి అభిప్రాయపడింది. అయితే, నటనను కాకుండా వ్యక్తిగత విషయాలను లేదా వేరే అంశాలను మధ్యలోకి లాగి విమర్శలు చేసినప్పుడు మాత్రం తనకు చాలా చిరాకు వస్తుందని, అది ఎంతమాత్రం సరికాదని తన ఆవేదనను వ్యక్తం చేసింది. కేవలం పనిపై మాత్రమే విమర్శలు ఉంటే బాగుంటుందని త్రిప్తి ఈ ఇంటర్వ్యూలో స్పష్టం చేసింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.





## సమంత ఫ్యాన్స్ గెట్ రెడీ అంటూ
### మా ఇంటి బంగారం అప్డేట్ ఇచ్చిన మేకర్స్

ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌లో జోరు పెంచిన సమంత.. హీరోయిన్‌గా, నిర్మతగా రాణిస్తూ మెప్పిస్తుంది. ఈ క్రమంలోనే తన సొంత బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా తన భర్త రాజ్ నిడిమోరుతో కలిసి నిర్మిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. ఇందులో సమంత ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుంది. 'ఓ బేబీ' తర్వాత నందిని రెడ్డి, సమంత కలయికలో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇదిలా ఉంటే.. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 15న రావాల్సి ఉండగా.. కొన్ని అనివార్య కారణాల చేత వాయిదా పడింది. ఇప్పుడు జూన్ 19న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ క్రమంలోనే ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస అప్డేట్ ఇస్తున్నారు. ఇందులో భాగంగా.. తాజాగా ఓ పోస్ట్ షేర్ చేశారు మేకర్స్. 'సమంత అభిమానులారా, సాయంత్రం 6 గంటలకు మా ఇంటి బంగారం నుంచి ఒక సర్ప్రైజ్ కోసం సిద్ధంగా ఉండండి.. మీ అందరికీ ఇది ఖచ్చితంగా నచ్చుతుంది' అంటూ తెలిపారు. దీంతో మా ఇంటి బంగారం నుంచి ఎలాంటి అప్డేట్ వస్తుందో అంటూ ఈగర్‌గా వెయిటింగ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్లు.

# తెలుగు, తమిళంలో బ్లాక్ బస్టర్ హిట్..

ఇటీవల 'కరుప్పు' చిత్రంతో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు కోలీవుడ్ స్టార్ సూర్య. త్రిష హీరోయిన్‌గా నటించగా, ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులో మే 15న వచ్చి సూపర్ సక్సెస్ అందుకుంది. రెండు భాషల్లోనూ ఈ చిత్రానికి మంచి టాక్ రావడంతో బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లను రాబట్టి.. రెండు వారాలు అవుతున్న పలు చోట్ల ఇప్పటికి థియేటర్స్‌లో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతుంది. ఈ క్రమంలోనే తాజాగా మరో అప్డేట్ ఇచ్చారు మేకర్స్. తెలుగులో, తమిళంలో అత్యధిక ప్రేక్షకాదరణ పొందడంతో ఇప్పుడు హిందీలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ మేరకు హిందీ ట్రైలర్ రిలీజ్ చేస్తూ.. 'తమిళం, తెలుగు భాషల్లో మీ అపారమైన ప్రేమను పొంది... ఇప్పుడు హిందీలో మీ ముందుకు వస్తున్నాం.. కరుప్పు హిందీ ట్రైలర్ వచ్చేసింది.. ఎమోషనల్ రైడ్‌ను వీక్షించండి' అంటూ చెప్పుకొచ్చారు.



# ఇండస్ట్రీ సమస్యలు.. దాసరి దారి చూపారు.. హీరోలకు మంచు మనోజ్ విజ్ఞప్తి

ప్రస్తుతం ఇండస్ట్రీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి దర్శకరత్న దాసరి నారాయణరావు ఎప్పుడో దారి చూపారని మంచు మనోజ్ అన్నారు. దాసరి నారాయణరావు సమాధి దుస్థితి చూసి చలించిపోయిన ఆయన తన టీమ్‌తో కలిసి శుభ్రం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా తన సతీమణి మౌనికతో కలిసి దాసరి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''గురువుగారు దాసరి వర్ధంతి అన్న సంగతి నాకూ గుర్తులేదు. చిత్రపురి కాలనీ వైపు వస్తుంటే, ఆ దారిలో గురువుగారి విగ్రహం ఉంటుంది. అది చూడగానే ఆయన కుటుంబం గుర్తు వచ్చింది. ఈలోగా ఆయన సమాధి పరిస్థితి తెలుసుకుని నా టీమ్‌తో కలిసి ఉదయాన్నే వచ్చేశా. అందరూ ఎంతో శ్రమించారు''

''దాసరిగారు గొప్ప దర్శకుడు. స్క్రీన్‌ప్లే రైటర్. ఎడిటింగ్, మ్యూజిక్, డైలాగ్స్ ఇలా అన్నింటిపైనా పట్టు కలిగిన వ్యక్తి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయనొక ఇనిస్టిట్యూట్. ఆయన ఎన్నో గొప్ప సినిమాలు తీశారు. సోషల్, కమర్షియల్, మహిళా ప్రాధాన్యమున్న చిత్రాలు రూపొందించారు. 'దాసరి పని అయిపోయింది' అని టాక్ వినిపించిన ప్రతిసారీ కొత్తదనంతో ప్రేక్షకులను అలరించారు. ప్రస్తుతం మనం థియేటర్స్ సమస్యలంటూ మాట్లాడుకుంటున్నాం. కానీ, నాకు తెలిసి గురువుగారు ఎప్పుడో దీనికి ఓ మార్గం చూపించారు. ఏడాదికి పది నుంచి పదిహేను సినిమాలు చేస్తూ.. ఎంతో మందికి ఉపాధి లభించేలా చేశారు. ఎప్పుడో ఓ సినిమా చేయటం కాదు.. ఎప్పుడూ సినిమా చేయాలని దాసరి అనేవారు. ఇకపై నాతో సహా అందరూ హీరోలు వీలైనన్ని ఎక్కువ సినిమాలు చేయాలని కోరుతున్నాను. ఆ బాధ్యత అందరిపైనా ఉంది. దాసరి ఘాట్‌ను పార్క్‌లా కాకుండా చుట్టు పక్కల పిల్లలు ఆడుకునేలా తీర్చిదిద్దితే బాగుంటుందని అనుకుంటున్నా'' అని అన్నారు.




# పెద్ది సాంగ్ వివాదంపై రామ్ చరణ్ క్లారిటీ

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ గా నటించిన సినిమా పెద్ది. బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా, జూన్ 4వ తేదీన రిలీజ్ కానుంది. ఈ మూవీలో రామ్ చరణ్ హీరోగా చేయగా, జాన్వీ కపూర్ హీరోయిన్ గా మెరిసింది. ఏఆర్ రెహమాన్ సంగీత స్వరాలు అందించిన ఈ సినిమా కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు అభిమానులు.

అయితే ఈ సినిమాలో హెల్లల్లల్లో సాంగ్ లో స్టెప్పులు అసభ్యంగా ఉన్నాయంటూ నార్త్ లో వివాదం రాజుకుంది. అయితే, ఈ సినిమా ప్రమోషన్స్ నేపథ్యంలో సాంగ్ వివాదంపై రామ్ చరణ్ క్లారిటీ ఇచ్చారు. జూనియర్ ఎన్టీఆర్ తో నాటు నాటు సాంగ్ ఎలా ఎంజాయ్ చేశానో, ఈ పాటలో శృతిహాసన్, జాన్వీ కపూర్ తోనూ అలాగే చేసినట్లు వివరించారు. ఈ రెండు సాంగ్స్ తాను వేరుగా చూడబోనని వివరించారు. అసభ్యంగా చూపించాలన్న ఉద్దేశం తమకు లేదని క్లారిటీ ఇచ్చారు. అలాంటప్పుడు ఎవరు ఎలా రిసీవ్ చేసుకున్న ఇబ్బంది లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు చరణ్.



# సైలెంట్‌గా.. గుట్టుచప్పుడు కాకుండా.. సరికొత్త సినిమాకు శ్రీకారం చుట్టిన క్రిష్ జాగర్లమూడి!



గమ్యం, వేదం, కంచె వంటి అద్భుతమైన సినిమాలను తెలుగు ప్రేక్షకులకు అందించిన విలక్షణ దర్శకుడు క్రిష్ జాగర్లమూడి.. గతేడాది 'ఘాటీ' చిత్రంతో వచ్చాడు. స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. అయితే.. ఈ సినిమాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన క్రిష్.. పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' నుంచి కూడా తప్పుకున్నాడు. కానీ 'ఘాటీ' కూడా విజయం అందించకపోవడంతో ఈ మూవీ తర్వాత పూర్తిగా సైలెంట్ అయిపోయాడు. అయితే.. తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఆయన ఎటువంటి హడావిడి లేకుండా ఓ సరికొత్త సినిమాకు శ్రీకారం చుట్టినట్లు టాక్. ఈ సారి ఎలాంటి స్టార్స్ లేకుండా.. హైప్ లేకుండా.. ఈశాన్య అడవుల్లో కొత్తవారితో ఓ సర్వైవల్ థ్రిల్లర్‌ను గుట్టుచప్పుడు కాకుండా తెరకెక్కిస్తున్నాడట. దీనికి సంబంధించిన షూటింగ్ పూర్తయ్యాకే బిగ్ రివీల్ ప్లాన్ చేస్తున్నట్లు ప్రస్తుతం నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500081. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 501510.

# పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**డిడి9వార్త / రామగుండం మే 31:**



స్థానిక రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్ పి హెచ్ ఎస్ ) ఆవరణ ఆదివారం నాడు అపురూపమైన వేడుకకు వేదికైంది. దాదాపు మూడు దశాబ్దాల క్రితం (19951996 విద్యాసంవత్సరంలో) ఇక్కడ పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులంతా ఒకే చోట చేరి, "ఆత్మీయ సమ్మేళనం" పేరిట ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.
ప్రాంతాలు వేరైనా, వృత్తులు వేరైనా... చిన్ననాటి స్నేహమే పరమావధిగా ఒకరి పిలుపుతో మరొకరు కదిలివచ్చిన నాటి మిత్రులు, సుదూర ప్రాంతాల నుండి సైతం ఈ వేడుకకు తరలివచ్చారు.

**భావోద్వేగాల మధ్య గురువందనం**

ఈ కార్యక్రమానికి నాటి ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి, జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి, పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ... ఎంతో కాలం తర్వాత తమ విద్యార్థులంతా బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజంలో స్థిరపడి, మళ్లీ ఇలా కలిసి గౌరవించడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందంటూ భావోద్వేగానికి లోనయ్యారు.

**చిన్ననాటి జ్ఞాపకాల నెమరువేత**

ఒకరినొకరు కౌగిలించుకుని, యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ స్నేహితులు సందడి చేశారు. క్లాస్‌రూమ్ ముచ్చట్లు, ఆటపాటలు, పరీక్షల నాటి టెన్షన్లు, ఆనాటి అల్లరి పనులను గుర్తుచేసుకుంటూ మురిసిపోయారు. వయసు మళ్లినా, ఆ కాసేపు అందరూ మళ్లీ పాఠశాల నాటి బాల్య వయసులోకి వెళ్ళిపోయి ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో సెషన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు**

కేవలం సరదాగా కలవడమే కాకుండా, తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు పూర్వ విద్యార్థులు ఒక మంచి నిర్ణయాన్ని తీసుకున్నారు. రాబోయే రోజుల్లో పాఠశాల మౌలిక వసతుల కల్పనకు, అలాగే ప్రస్తుతం చదువుకుంటున్న పేద విద్యార్థుల ఉన్నత చదువులకు తమవంతుగా ఆర్థిక సాయం, సహాయ సహకారాలు అందించనున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. చివరిగా సహపంక్తి భోజనాలతో, మళ్లీ త్వరలోనే కలుసుకోవాలనే ఆకాంక్షతో, మధురమైన జ్ఞాపకాలను మూటగట్టుకుని పూర్వ విద్యార్థులు తిరుగుపయనమయ్యారు. ఈ కార్యక్రమంలో 199596 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు,తూండ్ల శ్రీనివాస్ పటేల్, ఉప్పరి లక్ష్మణ్,మంతెన శ్రీకాంత్,ముడారి శ్రీనివాస్, దావు మురళి మొహన్,డేగల తిరుపతి, ఓదెల రాజమొగిలి,సాదీక్ పాషా ,మల్లేష్, భాస్కర్, గంగారాం, బ్రహ్మాము, సలీమ్, సుజాత, సునీత, ప్రసన్న లక్ష్మి, విజయ లక్ష్మి, ప్రభావతి, పద్మ ,వారి కుటుంబ సభ్యులు, పాఠశాల పూర్వ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్‌కు వేతనాల్లో 1.5%కోతలు వెంటనే నిలిపివేయాలి

- **సీఎం, డిప్యూటీ సీఎం జోక్యం చేసుకోవాలి**
- **స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏళ్ళ మధుసూదన్**

**డీ డీ 9 వార్త, ములుగు :**



ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు ఇంకా పూర్తిగా ఖరారు కాకముందే, మే నెల వేతనాల నుండి 1.5% కోత విధించడం పట్ల స్టేట్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏళ్ళ మధుసూదన్ తీవ్ర నిరసన వ్యక్తం చేసారు హాస్పిటల్స్‌తో ఒప్పందాలు పూర్తికాలేదు, ప్యాకేజీ రేట్లు నిర్ణయించలేదు, డిజిటల్ హెల్త్ కార్డులు జారీ కాలేదు. ఈహెచ్ఎస్ చందా మినహాయింపుపై స్పష్టమైన జీఓ కూడా వెలువడలేదు. అయినప్పటికీ ఆర్థిక శాఖ ఏకపక్షంగా వేతనాల్లో కోతలు విధించడం అన్యాయమని రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏళ్ళ మధుసూదన్ ఒక ప్రకటన లో పేర్కొన్నారు.ఐఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్ లో ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల వివరాల నమోదు ప్రక్రియ కూడా పూర్తిగా ముగియకముందే కోతలు విధించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పాత నిబంధనల ప్రకారం భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగులైతే ఒక్కరే చందా చెల్లించాల్సి ఉండగా, ఇప్పుడు ఇద్దరి వేతనాల నుంచీ కోత విధిస్తున్నారని తెలిపారు. ఆధారిత కుటుంబ సభ్యులపై కూడా స్పష్టత లేదన్నారు.ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత బాధ్యత ప్రభుత్వానిదేనని, ఉద్యోగ సంఘాలు సహకరించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, పారదర్శకత లేకుండా తీసుకుంటున్న నిర్ణయాలు ఉద్యోగుల్లో అసంతృప్తిని పెంచుతున్నాయని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి వెంటనే జోక్యం చేసుకొని వేతనాల్లో 1.5% కోతలను నిలిపివేసి, పూర్తి విధివిధానాలు ప్రకటించిన తరువాత మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# గండిపేట కాలువకు రక్షణ ఎక్కడ?

- **కాలువలో కూరుకుపోయిన ఇసుక లారీతో బయటపడిన అధికారుల నిర్లక్ష్యం**
- **హైదరాబాద్ తాగునీటి జీవనాడి ప్రమాదంలో**
- **పుప్పాలగూడ–షేక్‌పేట్ వరకు రక్షణ గేట్లు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు**
- **మధ్యలో పచ్చదనం పెంచి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్**

**రాజేంద్రనగర్ మే 31 డిడి 9 వార్త**



హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించే అత్యంత కీలకమైన 100 ఏండ్ల చరిత్ర కలిగిన గండిపేట క్యాన్ డ్యూడ్ కాలువ ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యానికి బలవుతోంది. కాలువకు సరైన రక్షణ చర్యలు లేకపోవడంతో తాజాగా ఓ ఇసుక లారీ కాలువలో కూరుకుపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.ఈ ఘటన నగర ప్రజలకు నీటిని అందించే జీవనాడి ఎంత నిర్లక్ష్యానికి గురవుతోందో మరోసారి స్పష్టం చేసింది.కాలువ వెంట రక్షణ గోడలు లేకపోవడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం,పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటున్నాయని స్థానికులు అంటున్నారు. గతంలోనూ పలుమార్లు ఇలాంటి ఘటనలు జరిగినప్పటికీ సంబంధిత శాఖల అధికారులు కనీసం స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది.
స్థానిక ప్రజలు పలుమార్లు ఆయా శాఖల అధికారులకు వినతిపత్రాలు సమర్పించి కాలువకు పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని కోరినా, అధికారులు పెడచెవిన పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నగరానికి తాగునీరు అందించే ఈ కీలక కాలువ రక్షణ విషయంలో అధికారుల నిర్లక్ష్యం భవిష్యత్తులో మరింత ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.కాలువను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే" అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పుప్పాలగూడ నుంచి షేక్‌పేట్ వరకు కాలువకు ఇరువైపులా భారీ రక్షణ గేట్లు ఏర్పాటు చేసి,మధ్య ప్రాంతంలో పచ్చదనం వెల్లివిరిసేలా మొక్కలు నాటి సుందరీకరణతో పాటు భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, గండిపేట కాలువ పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి వెంటనే అమలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



## అత్తింటి వేధింపులు భరించలేక

# యువతి ఆత్మహత్య

- **ప్రేమ వివాహం ఏడాదికే విషాదాంతం**
- **భర్త,అత్త వేధింపులతో మానసిక వేదన**
- **ఉరివేసుకుని తనువు చాలించిన వివాహిత**

**రాజేంద్రనగర్ మే 31 డిడి 9 వార్త**

రాజేంద్రనగర్ పరిధిలో అత్తింటి వేధింపులు భరించలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్న యువతి జీవితం ఏడాదికే విషాదాంతమైంది.పోలీసుల వివరాల ప్రకారం..భవాని (26) ప్రేమ వివాహం శ్రీకాంత్‌తో 2025 జూన్ నెలలో పెద్దల సమక్షంలో జరిగింది.వివాహం అనంతరం నుంచి అత్త కనకమ్మ తరచూ మద్యం సేవించి ఇంటికి వచ్చి భవానిని తిట్టుతూ,కొడుతూ వేధింపులకు గురిచేసేది.ఈ వేధింపులకు భర్త శ్రీకాంత్ కూడా మద్దతు ఇవ్వడంతో భవాని తీవ్ర మానసిక వేదనకు గురైంది. రెండు రోజుల క్రితం కుటుంబంలో శుభకార్యానికి, భవాని, శ్రీకాంత్‌లు తమ స్వగ్రామమైన సిద్దిపేటకు వెళ్లారు.అక్కడ కూడా అత్త కనకమ్మ,భర్త శ్రీకాంత్ కలిసి అందరి సమక్షంలో భవానిని అవమానిస్తూ తీవ్రంగా దూషించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు .ఈ నెల 30వ తేదీ ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో భవాని తన తండ్రి ఎల్లయ్యకు ఫోన్ చేసి కన్నీటి పర్యంతమై, తనను అత్తింటివారు మానసికంగా తీవ్రంగా వేధిస్తున్నారని,ఇక బ్రతకాలనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. అనంతరం రాజేంద్రనగర్‌లోని మాణిక్యమ్మ కాలనీలో ఉన్న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.మృతురాలి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# డీ డీ 9 వార్త కథనాలకు స్పందించిన అధికారులు

- **లక్ష్మీదేవిపేట కొనుగోలు కేంద్రాలను సందర్శించిన సివిల్ సప్లై**
- **కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు**

**ములుగు జిల్లా డి సి ఎస్ ఓ**

ములుగు, డీ డీ 9 వార్త : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సివిల్ సప్లై అధికారులు స్పందించారు. ఇటీవల డీ డీ 9 వార్త దినపత్రికలో వచ్చిన కథనాలపై వారు స్పందించారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేటలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఇటీవల దినపత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనితో స్పందించిన డీ సీఎస్ఓ, డిప్యూటీ తాసిల్దార్ సివిల్ సప్లై ఆదివారం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు సెంటర్లోని కాంటాలను పరిశీలించి అక్కడున్న రైతులతో సెంటర్ నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలక్ట్రానిక్ కాంటాలను మాత్రమే వినియోగించాలని, గొలుసు కాంటాలను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ కాంటా బదులు గొలుసు కాంటాను వినియోగించినట్లు వారు గుర్తించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గొలుసు కంటలు వినియోగించరాదని, లారీల పేరుతో బస్తకు 10 రూపాయలు వసూలు చేయడాన్ని వారు తప్పు పట్టారు. అలాంటి చర్యలకు పాల్పడితే వారి సెంటర్లను రద్దు చేస్తామని ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారులు సెంటర్ నిర్వాహకులను హెచ్చరించారు.

# కాపాడాలని దిగాడు కాలమే కబలించింది..

- **బావిలో పడి ఇద్దరు మృతి..**
- **రక్షించేందుకు దిగిన వ్యక్తి కూడా మృత్యువాత..**

**మే31 డిడి 9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం మండలం బి.సి.మర్రిగూడెం గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. బావిలో పడిన వ్యక్తిని కాపాడేందుకు దిగిన మరో వ్యక్తి కూడా నీటిలో మునిగి మృతి చెందాడు.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బి.సి.మర్రిగూడెం గ్రామానికి చెందిన బద్ది రమేష్ (35) ఆదివారం ఉదయం మద్యం మత్తులో గ్రామంలోని ఓ నిరుపయోగంగా ఉన్న ఇంటి వెనుక బావిలో పడిపోయాడు. బావిలో ఉన్న మోటార్ పైపును పట్టుకుని సహాయం కోసం అరుస్తుండగా, విషయం తెలుసుకున్న చర్చి పేటకు చెందిన రేగ నరసింహారావు అలియాస్ బాబు (40) తాడు సహాయంతో బావిలోకి దిగి రక్షించేందుకు ప్రయత్నించాడు.
అయితే అనూహ్య పరిస్థితుల్లో నరసింహారావు కూడా నీటిలో మునిగిపోగా, అనంతరం బద్ది రమేష్ సైతం మునిగి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు బద్ది నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈవిషాద సంఘటనతో, వెంకటాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో,
మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. చనిపోయిన పేద కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





# ప్రజా వైద్యుడికి పట్టం..

- **సరైనోడి కీ..., సరైన పదవి..,**
- **ప్రజా వైద్యుడికి మంత్రి సీతక్క ఆశీస్సులు**
- **కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపు**
- **డిసిసి వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధ్యక్షుడిగా డా. రవిబాబు**
- **మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపిన డా. రవిబాబు**

**ములుగు, డీ డీ 9 వార్త :**



ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక సీనియర్ డాక్టర్ రవి బాబును డిసిసి వైద్య ఆరోగ్యశాఖ ములుగు జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క సిఫారసుతో రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మంత్రి సీతక్క ఆదివారం జరిగిన ఓ పార్టీ కార్యక్రమంలో ఆయనకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

**సరైనోడి కి..., సరైన పదవి..,**

మల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రజా వైద్యుడు డాక్టర్ రవి బాబుకు మంత్రి సీతక్క సరైన పదవి కట్టబెట్టింది. గత 30 ఏళ్లుగా మల్లంపల్లి మండల కేంద్రంలో డా. రవిబాబు దంపతులు బాలాజీ నర్సింగ్ హోమ్ స్థాపించి నిరుపేద ప్రజలకు ఎనలేని సేవలు చేస్తున్నారు. మల్లంపల్లిలో ఉన్న ఎర్రమట్టి క్వారీలలో పనిచేస్తున్న కూలీలకు, వివిధ రకాల వాహన డ్రైవర్లకు, క్లీనర్లకు, మల్లంపల్లి మండలంలోని అన్ని గ్రామాల నిరుపేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో మంచి గుర్తింపు పొందారు. వివిధ రకాల రోగాల బారిన పడి ఇబ్బంది పడుతున్న రోగులకు బాలాజీ నర్సింగ్ హోమ్ లో మెరుగైన చికిత్సలు అందించి వారికి ఆరోగ్యాన్ని పెంపొందిస్తున్నారు. ఈ క్రమంలో రవి బాబు దంపతులకు ఈ ప్రాంతంలో తగిన గుర్తింపు ఉండడంతో పాటు పేదల డాక్టర్ గా పేరొంది నాడు.

**కాంగ్రెస్ నాయకుడిగా పార్టీకి సేవలు**

మల్లంపల్లి పట్టణానికి చెందిన పేదల వైద్యుడు డాక్టర్ రవిబాబు వృత్తి తో పాటు రాజకీయాల్లో సైతం నిలదొక్కుకున్నారు. ప్రధానంగా మొదటి నుండి ఆయన కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ఆ పార్టీ బలోపేతానికి కృషి చేశాడు. మంత్రి సీతక్క వెన్నంటి ఉంటూ ఆమె గెలుపులో కీలక పాత్ర పోషించారు. వైద్య వృత్తి తో పాటు కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించిన మంత్రి సీతక్క అతడిని డిసిసి జిల్లా వైద్యారోగ్య శాఖ అధ్యక్షుడిగా నియామకం చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ మంత్రి సీతక్క తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన సీతక్కతోపాటు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, కాంగ్రెస్ పార్టీ మల్లంపల్లి మండల అధ్యక్షురాలు కుసుమ సున్నిత, మల్లంపల్లి గ్రామ సర్పంచ్ ల్యాడే శ్యామ్ రావు లతో పాటు జిల్లా అనుబంధ శాఖల నాయకులకు, మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



# మానవత్వంలో బడా (నాగ) జ్యోతి

- మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన నాగజ్యోతి

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా జాకారం గ్రామపంచాయతీకీ చెందిన కాలువల అర్జున్ మరణించగా వారియొక్క కుటుంబాన్ని పరామర్శించి రూ. 3000 ఆర్థిక సాయం అందించారు. వారి కుటుంబానికి బీ అర్ ఎస్ పార్టీ ఎల్ల వేళల అండగా ఉంటుంది అని బడే నాగ జ్యోతి అన్నారు. టిఆర్ఎస్ ములుగు జిల్లా సీనియర్ నాయకులు వేములపల్లి బిక్షపతి, సానికొమ్ము రమేష్ రెడ్డి, ఆకుతోట చంద్ర మొగిలి, కోళ్ళ వెంకన్న, దొడ్డిపెల్లి రఘుపతి, జాకారం సర్పంచ్ దాసరి సరిత రమేష్, వార్డు సభ్యులు బోట్ల ప్రశాంత్, మాజీ సర్పంచులు సిద్దబోయిన శివరాజ్, గండి కుమార్, యూత్ నాయకులు కోయిల మహేష్, కొనుకటి ప్రశాంత్, ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు కోయిల లక్ష్మీ, బైకని సాగర్, బైకని ఓదెలు, నాయకులు దుడబోయిన శ్రీనివాస్, మదం సాగర్, అరిచెర్ల రాజేష్, జాకారం గ్రామ కమిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# బస్ డిపో పనులను వేగవంతం చేసి త్వరలో ప్రారంభిస్తాం

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల డిమాండ్ పెరిగింది.
- ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు.
- ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.
- పెద్దపల్లి బస్ డిపో స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ విప్.

**డిడి9వార్త / పెద్దపల్లి మే 31:**

తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్..
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రతిపాదిత బస్ డిపో స్థలాన్ని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మరియు ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు

**ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...**

ప్రభుత్వ విప్ విజయ రమణారావు సీనియర్ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి పెద్దపల్లికి ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేశారని తెలిపారు.బస్ డిపో పనులు కొంత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం వాటిని వేగవంతం చేసి త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాలకు బస్సు కనెక్టివిటీని మరింత మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలనే డిమాండ్ పెరిగిందని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త ఆర్టీసీ బస్సుల కొనుగోలు ప్రక్రియ కూడా కొనసాగుతోందని, ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసీని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్మికులకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు.ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో ఐదుగురు మంత్రులు, సీనియర్ అధికారులు, 40 మంది ఆర్టీసీ ప్రతినిధులతో చర్చలు జరిపి కార్మికులకు 11 శాతం పీఆర్సీ మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నామని, ఎన్నికైన ప్రతినిధులతో చర్చించి భవిష్యత్తులో ఆర్టీసీ విలీన ప్రక్రియను చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. విలీన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు, అడ్డంకులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, కార్మికులు అనవసర ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మున్సిపల్ చైర్మన్లు మరియు కౌన్సిలర్లు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం

- వి ఆర్ 4 సహయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పూజా సామగ్రి పంపిణీ
- వంద జంటలతో భక్తిశ్రద్ధల మధ్య ప్రత్యేక పూజలు
- పూజానంతరం అన్నప్రసాద వితరణ

**రాజేంద్రనగర్ మే 31 డిడి 9 వార్త**

పుప్పాలగూడలోని మహావీర్ హనుమాన్ మందిరంలో,వి ఆర్ 4 సహయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌర్ణిమ సందర్భంగా ఆదివారం సామూహిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ట్రస్ట్ తరపున ఉచితంగా పూజా సామగ్రిని సమకూర్చి వినూత్నంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మేనేజింగ్ ట్రస్టీ అందే లక్ష్మణ్ రావు తెలిపారు .ఈ సందర్భంగా గణపతి,గౌరమ్మ,నవగ్రహ, అష్టదిక్పాలక పూజలు భక్తుల ఇష్టధాన్యాలతో ప్రత్యేకంగా నిర్వహించగా,అనంతరం పురోహితుడు మండువ మధుసూదన శర్మ వేదమంత్రోచ్చారణల నడుమ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు.
ఈ సంప్రదాయ పద్ధతిలో జరిగిన సామూహిక వ్రతంలో సుమారు వంద జంటలు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ప్రతి పౌర్ణిమ సందర్భంగా పుప్పాలగూడ పంచకమిటీ లోధ క్షత్రియ సదర్ పంచాయతీ ఆధ్వర్యంలో దేవాలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేపట్టడం ఆనవాయితీగా కొనసాగుతోందని కమిటీ సభ్యులు తెలిపారు.పూజా కార్యక్రమం అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచకమిటీ లోధ క్షత్రియ సదర్ పంచాయతీ కమిటీ సభ్యులతో పాటు రాజన్ భాయి తదితరులు పాల్గొన్నారు.





# పదవీ (ఉద్యోగ) విరమణ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు.మే 31**
**(డి డి 9వార్త)**

విద్యా సేవలో అంకితభావం,క్రమశిక్షణకు మారుపేరుగా నిలచి, విద్యా రంగంలో 37 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన తెలంగాణ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత,NCC అధికారి కెప్టెన్ దొడ్డి భద్రయ్య పదవీ విరమణ కార్యక్రమం మణుగూరు లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం లోని బయ్యారం క్రాస్ రోడ్డు లోని జీ వి ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన మరో కార్యక్రమంలో గెజిటెడ్ హెడ్ మిస్ట్రెస్ కలివేటి రమణ ఉద్యోగ విరమణ కార్యక్రమం లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని శాలువాతో సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మాట్లాడుతూ..అధ్యాపకుడిగా, ప్రిన్సిపల్ గా,పరిపాలన దక్షుడిగా దొడ్డి భద్రయ్య చేసిన సేవలను కొనియాడారు. అలాగే 25 సంవత్సరాలు ఉపాధ్యాయినిగా విశిష్ట సేవలందించి ఎందరో విద్యార్థినీ, విద్యార్థులకు మార్గదర్శకురాలిగా నిలిచిన శ్రీమతి కలివేటి రమణ ZPHS పినపాక, గెజిటెడ్ హెడ్ మిస్ట్రెస్ గా విశేష కృషి చేశారని కొనియాడారు. ఆమె అందించిన సేవలు విద్యారంగానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వారు ఇరువురు పదవీ విరమణ అనంతరం కూడా తమ అనుభవాలు,మార్గదర్శకత్వంతో సమాజానికి సేవలు అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు,మండల, టౌన్ అధ్యక్షులు సర్పంచులు, ఉప సర్పంచులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడలవైపు మొగ్గు చూపాలి



- ఎమ్మెల్యే టీ. ప్రకాష్ గౌడ్
- చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచన
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే

**రాజేంద్రనగర్ మే 31 డిడి 9 వార్త**

శంషాబాద్ మండలం పెద్దతూప్రా గ్రామంలో బొద్దం మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే టీ.ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రోఫీలు,బహుమతులు అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలవైపు మొగ్గు చూపాలని సూచించారు.క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణను అలవర్చుతాయని తెలిపారు.
యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొంటూ,గ్రామస్థులతో పాటు టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన బొద్దం మహేష్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.భవిష్యత్తులో జిల్లా,రాష్ట్ర స్థాయిలో మరిన్ని క్రీడా పోటీల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువకులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు పలువురు నాయకులు పాల్గొన్నారు.



# తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభకు భారీగా తరలిరండి

- తాపీ మేస్త్రీలను కించపరిచే వ్యాఖ్యలపై ఆగ్రహం
- జూన్ 8న ఇందిరాపార్క్‌లో భారీ సభ
- సభను విజయవంతం చేయాలని కార్మిక సంఘం పిలుపు

**రాజేంద్రనగర్ మే 31 డిడి 9 వార్త**

గ్రేటర్ హైదరాబాద్ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం ఆధ్వర్యంలో జూన్ 8న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న తాపీ మేస్త్రీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.రాష్ట్ర అధ్యక్షులు కామల్ల ఐలన్న పిలుపుమేరకు ఆదివారం చింతల్‌మెట్ కార్యాలయం వద్ద తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఇటీవల కొందరు సెంట్రింగ్ మేస్త్రీలు “తాపీ మేస్త్రీకి హటావో సెంట్రింగ్ కాంట్రాక్టులను బచావో” అనే నినాదంతో తాపీ మేస్త్రీలను కించపరిచే విధంగా మాట్లాడటం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఈ వ్యాఖ్యలు తాపీ మేస్త్రీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాపీ మేస్త్రీల గౌరవాన్ని కాపాడుకునేందుకు జూన్ 8న ఇందిరాపార్క్‌లో నిర్వహించే ఆత్మగౌరవ సభకు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కోరారు.ఈ సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సూర వెంకటయ్య,ప్రధాన కార్యదర్శి ఆదిరాల రవికుమార్‌తో పాటు మహేష్,మాలాద్రి,శ్రీనివాస్, నరసింహ, సుధాకర్,శ్రీను, మాల కొండయ్య,మాధవ్, వీరాంజనేయులు,రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.





# గండిపేట ఎంఈఓ నిరంజన్‌కు ఘన వీడ్కోలు

- మణికొండ జెడ్పీహెచ్ఎస్‌లో పదవీ విరమణ సభ
- మెరిట్ విద్యార్థులకు సన్మానం,ఆర్థిక సహాయం
- విద్యా సేవలకు ప్రశంసల వెల్లువ

**రాజేంద్రనగర్ మే 31 డిడి 9 వార్త**

గండిపేట మండల విద్యాధికారి మణికొండ జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా సేవలందించిన నిరంజన్ పదవీ విరమణ చేసిన సందర్భంగా మణికొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ కే. రామకృష్ణ రెడ్డి,ఉపాధ్యాయ బృందం కలిసి నిరంజన్ కి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేసి,విద్యారంగానికి అందించిన విశిష్ట సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్,నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్,నాయకులు శ్రవణ్ కుమార్,శివగంగ సంతోష్ తదితరులు పాల్గొని నిరంజన్ సేవలను ప్రశంసించారు.
అదేవిధంగా ఈ విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో 500కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు.పాఠశాలలో మొదటి ర్యాంకు సాధించిన దివ్య,రెండో ర్యాంకు భానుప్రసాద్ గౌడ్,మూడో ర్యాంకు సాధించిన వేంకట సాత్వికకు మణికొండ గాయత్రి బ్రాహ్మణ ఐక్య వేదిక సంఘం ఆర్థిక సహాయం అందించి ఉన్నత చదువులకు ప్రోత్సాహం కల్పించింది.
సోషల్ స్టడీస్‌లో 100కి 100 మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ఉత్తమ బోధన అందించిన సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించారు.
గత సంవత్సరం ప్రతిభ కనబరిచిన విద్యార్థిని స్వాతి ప్రస్తుతం హయత్‌నగర్‌లోని క్షేత్ర జూనియర్ కాలేజీలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతూ 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి మరోసారి ప్రతిభ చాటింది. ఆమె ఉన్నత చదువుల కోసం కే.రామకృష్ణ రెడ్డి రూ.25 వేల చెక్కు, సామాజికవేత్త మంచికంటి సంతోష్ కుమార్ రూ.10 వేల చెక్కును అందజేశారు.
ఈ సందర్భంగా స్వాతి తల్లిదండ్రులు సహాయ దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థులకు అందుతున్న ప్రోత్సాహం మరింత ఉన్నత లక్ష్యాలకు దోహదపడుతుందని తెలిపారు.

# మా వాడలో మా రాజ్యం కావాలి

- **జాతీయ కార్యదర్శి కామ్రేడ్. పగడాల కోదండ.**

**డీ డీ 9 వార్త, ములుగు :**



కామ్రేడ్ వావిలాల లక్ష్మన్ అధ్యక్షతన, కామ్రేడ్ మారోజు వీరన్న 27వ వర్ధంతి తొ పాటు, 145మంది అమర వీరల సంస్మరణ ముగింపు సభ ములుగు జిల్లా అమరవీరుల స్థూపం దగ్గర ఘనంగా నిర్వహించడం జరిగింది.
ఈ సభకు ముఖ్య అతిథిగా సిపియుఎస్ఐ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ పగడాల కోదండన్న పాల్గొన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతు, తెలంగాణ మూడో ముఖ్యమంత్రి దళిత బహుజన ఆడవాళ్లు కావాలని, ఆడజన రాజ్యాధికార సమాక్య రాష్ట్ర నాయకురాలు సల్వాది జ్యోతక్క డిమాండ్ చేయడం జరిగింది. ఈ డిమాండ్ కు సిపియుఎస్ఐ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని జాతీయ కార్యదర్శి పగడాల కోదండ చెప్పడం జరిగింది.

**కామ్రేడ్ మారోజు వీరన్న నిర్మించిన సిపియుఎస్ఐ పార్టీ**

ఎర్రజెండా ఎవ్వరి కాళ్ళ కింద నలగదని, అమరుల నెత్తుటితో, త్యాగాలతో ఎరుపెక్కిన సిపియుఎస్ఐ ఎర్రజెండ అమరుల స్థూపం మీదనే దగ దగ మెరుస్తూ ఎగురుతుందని తెల్పడం జరిగింది.
కల్వకుంట్ల కవితక్కతో మా పొత్తు కొనసాగుతుంది. సామాజిక తెలంగాణ , మా వాడలో మారాజ్యం , సబ్బండ కులాలకు సమాన అధికారం లక్ష్య సాధనలో బాగంగా, ఎవ్వరితోనైనా మేము పొత్తుపెట్టుకుంటామని, మా లక్ష్య సాధనకోసం ఎవ్వరు మద్దతిచ్చినా వాళ్ళతో కలసి నడుస్తామని పగడాల కోదండ తెలిపారు. మా వాడలో మా రాజ్యం మా పార్టీ లక్ష్యమని, సమస్త కులాలకు అధికారం దక్కలంటే మా వాడలో మా రాజ్యంకోసం పోరాటం చేయలని పిలుపు నిచ్చారు. సిద్దేశ్వర్ విషయంలో చార్వాక చెప్పినది అబొద్ధం. 27సంవత్సరాల తర్వాత, బోనస్ లైపు కోసం తప్పుగా చెప్పుతున్నారు.
మారోజు వీరన్న రాసిన డాక్యుమెంట్ మీద 21రోజు చర్చ జరిగింది. ఆ సమావేశంలో పాల్గొన్న ప్రతినిదులందరు ఆమోదిస్తే, కులవర్గ పోరాట సిద్ధాంతం తప్పని, దోమర తోవ సమావేశంలో పార్టీ చీలికకు కారకుడైనా పుల్లన్న, ఈ రోజు కులవర్గ పోరాటం సరైనదని చెప్పడమంటే పుల్లన్న అవకాశ వాదానికి అద్దం పడుతుందని తెలిపారు.యాదన్నా, స్వరూపక్కా 145 మంది అమర వీరుల ములుగు స్థూపం కోసం అశేషమైనా కృషిచేసి నిర్మించారు. అనగారిన కులాలకు అధికారం రావాలన్నా, జనాభా దామాషా ప్రకారం వాటా కావాలన్నా, మారోజు వీరన్న తో పాటు 145 మంది అమరవీరులు కలలుగన్న దళిత బహుజన జనతా ప్రజాస్వామిక విప్లవం సహకారం కావాలన్నా, మా వాడలో మా రాజ్యం ద్వారానే సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ ధైద వెంకన్న తెలిపారు. ఇండియా సంయుక్త రాష్ట్రాల కమ్యూనిస్టు పార్టీ మాజీలందరూ తిరిగి పార్టీలో పని చేయాలని పిలుపునిచ్చారు. అమరుల స్థూపానికి ఎర్రరంగు ఇప్పిచ్చిన సినిమా డైరెక్టర్ రవిచంద్రకు, సిపియుఎస్ఐ రాష్ట్ర కమిటీ నుండి ప్రత్యేక దన్యవాదములు తెలిపారు దళిత బహుజన రాజ్యాధికార సమాక్య రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లిరవి మాట్లాడుతు ఉమ్మడి గ్రామ పంచాయతీలు రద్దు చేసి,ప్రతి కులం వాడ గ్రామ పంచాయతీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో 242 కులాలు వుంటే 22కులాలు మాత్రమే అసెంబ్లీలో అడుగు పెట్టాయని ఇది ప్రజాస్వామ్యం విధానానికి విరుద్దమని తెలిపారు. అందుకే కులం ఉమ్మడి నియోజకవర్గాలు రద్దు చేసి, కుల ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపీ నియోజకవర్గాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రముఖ న్యాయ వాది**

తీగల జీవన్ మాట్లాడుతు, విప్లవకారులపైన అనుచిత వాక్యలు భూర్జువ పార్టీలో ఉన్న నాయకులు మాట్లాడుతే ఊరుకోమని చెప్పారు. మీ మీ అంతర్గత ఘర్షణలతో
విప్లవకారులను విమర్శించడం సరైన విధానం కాదని, ఈ గడ్డ, నివురు గప్పిన నిప్పు లాంటి విప్లవ గడ్డని, తిరిగి కమ్యునిజం పుంజుకుంటుందని, వచ్చే ప్రభుత్వం మాదేనని తెలిపారు. ఈ సభలో సి రమేష్ సిపియుఎస్ఐ రాష్ట్ర సహాయకార్యదర్శి, ముంజాల బిక్షపతి, మాండ్రోజు వెంకన్న, ఆడజన రాజ్యాధికార సమాక్య నాయకులు కల్లెపెల్లి ఇంంద్రక్క వెన్నెల, స్వరూప, హర్షం స్వప్న, స్వప్న, ఎల్ పి రాము, గడ్డంశరత్, మాచర్ శ్రీనివాస్, పిట్టిల రాజమౌళి, మిద్దెరాములు, పద్మక్క, పగడాల రమేష్, మనుబోతుల మల్లేష్, రాజెందర్, రేల విజయ్, సుధాకర్, యాదన్నా యాదవ్, నాగరాజు ఆదోనిజిల్లా సాధన సమితి., మొదలగు సిపియుఎస్ఐ జిల్లా, మండల కమిటీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాసర ఐఐఐటీలో సీటు సాధించిన చల్వాయి విద్యార్థిని పూజ

- **జడ్‌పీహెచ్ఎస్ చల్వాయి ఖాతాలో మరో ఘన విజయం. – ప్రభుత్వ పాఠశాల ప్రతిభకు నిదర్శనం**



**గోవిందరావుపేట, మే 31 (డిడి 9 వార్త)**

జడ్‌పీహెచ్ఎస్ చల్వాయి పాఠశాల విద్యార్థిని పూజ బాసర ఐఐఐటీలో ప్రవేశం సాధించి పాఠశాలకు మరోసారి గర్వకారణంగా నిలిచింది. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థులు సాధించిన అద్భుత విజయాలకు ఇది మరో మైలురాయిగా నిలిచిందని ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కాటం మల్లారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు టి. హరిత, ఉపాధ్యాయులు సోలిపురం చంద్రారెడ్డి, రమాదేవి, శ్రీనివాసరావు, చాప బాబు, రమణమూర్తి, శంకరయ్య, శ్రీదేవి, సుధాకర్, సారయ్య, అన్నపూర్ణ, అవంతిక వెంకటేష్ తదితరులు పాల్గొని పూజను ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "విజయం అనేది యాదృచ్ఛికం కాదు.. కష్టానికి లభించే ప్రతిఫలం. గురువుల మార్గదర్శకత, విద్యార్థుల పట్టుదల కలిస్తే లక్ష్య సాధన సులభం అవుతుంది" అని పేర్కొన్నారు. పాఠశాల విజయాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, జడ్‌పీహెచ్ఎస్ చల్వాయి విద్యార్థులు వరుస విజయాలతో మరోసారి నిరూపించారని వారు అన్నారు. పూజ సాధించిన ఈ విజయం మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షిస్తూ ప్రధానోపాధ్యాయులు కాటం మల్లారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



# శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారికి వైభవంగా సహస్ర ఘట్టాభిషేకం..

**మణుగూరు.మే 31(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలం,గుట్టమల్లారం గ్రామంలో గల ప్రముఖ శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి సమేత శ్రీ ఉమా లింగేశ్వర స్వామి వారి ఆలయంలో గల "శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి వారికి నదీ జలాలతో "సహస్ర ఘట్టాభిషేకం" కార్యక్రమం ఆదివారం నాడు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా వైభవోపేతంగా నిర్వహించటం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దోసపాటి వెంకటేశ్వరరావు,దోసపాటి నాగేశ్వరరావు,సమితి సింగారం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ గాండ్ల సురేష్,,వడియాల ప్రభాకర్రావు ,శ్రీ వారి సేవ ఉమాశంకర్రాజు గారి బృందం,కరివెండి విశ్వనాథ గుప్తా,ఆలయ అర్చకులు సందీప్ శర్మ,గౌతం మహదేవ్ శర్మ గార్లు ,మరియు భక్త బృందం అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవాదుల ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వం

- **ఆసియాలోనే రెండవ అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్ట్**
- **ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి ఇంకా రూ.4,000 కోట్లు అవసరం**
- **కాలువల పనులు, భూసేకరణలో ప్రభుత్వం నిర్లక్ష్యం**
- **కేంద్ర సహకారం దూరమవుతోందన్న శ్రీకాంత్ గౌడ్**
- **మూడో దశ పనులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్**

**హైదరాబాద్,మే 31,(డిడి9 వార్త):**



ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లోని సుమారు 5.56 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్ట్ ఆసియా ఖండంలోనే రెండవ అతిపెద్ద ఎత్తిపోతల పథకమని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మొత్తం 38.16 టీఎంసీల నీటిని ఎత్తిపోసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగిందన్నారు. తాజాగా ప్రాజెక్ట్ అంచనా వ్యయాన్ని రూ.18,442 కోట్లకు పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటివరకు రూ.14,442 కోట్లు ఖర్చు చేశామని చెబుతోందని ఆయన తెలిపారు. అయితే ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి ఇంకా రూ.4,000 కోట్ల నిధులు అవసరమని పేర్కొన్నారు. కేంద్రరాష్ట్ర ప్రాజెక్టుల ప్రగతి సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం కాలువల తవ్వకం, గ్రావిటీ కాలువల నిర్మాణం, భూసేకరణ వంటి కీలక అంశాల్లో తీవ్ర అలసత్వం ప్రదర్శించిందని కేంద్రం అభిప్రాయపడిందన్నారు. అవసరమైన నివేదికలను సమయానికి సమర్పించకపోవడంతో కేంద్ర సహకారం లభించదని స్పష్టంగా తెలిపిందని, దీంతో ప్రాజెక్ట్ పూర్తి బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వంపైనే పడిందని విమర్శించారు. ప్రస్తుతం మిగిలి ఉన్న మూడో దశ పనులను వేగవంతం చేసి, 2,659 ఎకరాల భూసేకరణను పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మిగిలిన 2 లక్షల 23 వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ కోరారు.



# మృతుని కుటుంబానికి బీ ఆర్ఎస్ నాయకుల పరామర్శ

- **మృతుల కుటుంబాలకు అండగా మేమున్నాం**
- **ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బడే నాగజ్యోతి**
- **ములుగు జిల్లా నాయకులు వేములపల్లి బిక్షపతి**

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు నియోజకవర్గం లోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన యర మల్లయ్య పరమపదించగా వారి కుటుంబ సభ్యులను టిఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్చార్జి బడే నాగజ్యోతి, జిల్లా సీనియర్ నాయకులు వేములపల్లి బిక్షపతి లు కలసి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ములుగు నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బడే నాగజ్యోతి జగదీష్, వేములపల్లి బిక్షపతి లు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ మృతుల కుటుంబానికి ఎల్లవేళల అండగా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా నాయకులు వేములపల్లి బిక్షపతి మాజీ మండల అధ్యక్షులు సనికొమ్ము రమేష్ రెడ్డి ఆకుతోట చంద్రమొగిలి కోళ్ళ వెంకన్న దొడ్డిపెల్లి రఘుపతి సర్పంచులు తప్పెట్ల రాజేందర్ దాసరి రమేష్ మాజీ సర్పంచ్ గండి కుమార్ సిద్దబోయిన శివరాజ్ ఉప సర్పంచ్ అన్న తిరుపతి ములుగు కౌన్సిలర్లు కొగిల లక్ష్మీ బైకని సాగర్ బైకని ఓదెలు యూత్ మాజీ అధ్యక్షులు కోగిల మహేష్ ఉయ్యాల భద్రయ్య దుడబోయిన శ్రీనివాస్ మదం సాగర్ కొనుకటి ప్రశాంత్ కొమరం సిద్దు అరిచెర్ల రాజేష్ గ్రామ కమిటీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరి కోయ్యల మంటలతో ఆయిల్ పామ్ తోట దగ్ధం

**గోవిందరావుపేట, మే 31( డి డి 9 వార్త )**

వ్యవసాయ భూముల్లో వరి కోయ్యలను నిర్లక్ష్యంగా కాల్చడంతో మంటలు వ్యాపించి ఆయిల్ పామ్ తోటకు నష్టం వాటిల్లిన ఘటనపై పసర పోలీసులు వేగంగా స్పందించి ఇద్దరు రైతులపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని పసర ఎస్ఐ తాజుద్దీన్ వెల్లడించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన ఎర్రం సారయ్య, చివర రవీందర్ పొలాల్లో వరి కోయ్యలకు నిప్పంటించారు. అయితే మంటలు అదుపు తప్పి సమీపంలోని మెరుగు రమేష్‌కు చెందిన ఆయిల్ పామ్ తోటలోకి వ్యాపించాయి. ఈ ఘటనలో పలు ఆయిల్ పామ్ చెట్లు, డ్రిప్ ఇరిగేషన్ పైపులు, ఇతర వ్యవసాయ పరికరాలు పూర్తిగా దగ్ధమై రైతుకు గణనీయమైన నష్టం సంభవించింది. బాధితుడు మెరుగు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు రైతులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ తాజుద్దీన్ తెలిపారు.

**వరి కోయలు కాల్చొద్దు.. భూసార పెంపునకు వినియోగించండి: ఎస్ఐ తాజుద్దీన్**

వరి కోయలు, పంట అవశేషాలను కాల్చకుండా భూసార పెంపునకు ఉపయోగించుకోవాలని పసర ఎస్ఐ తాజుద్దీన్ సూచించారు. వరి కోయలను కాల్చడం వల్ల భూమిలోని సూక్ష్మ జీవులు నశించడంతో పాటు నేల సారవంతత తగ్గిపోతుందని ఆయన తెలిపారు. వరి కోయలను పొలంలోనే కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవడం ద్వారా భూమి సారాన్ని పెంచుకోవచ్చని, తద్వారా పంట దిగుబడులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కోయలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, మంటలు అదుపు తప్పి సమీపంలోని పంటలు, తోటలు, ఆస్తులకు నష్టం కలిగించే ప్రమాదం ఉంటుందన్నారు. వ్యవసాయ అవశేషాల నిర్వహణలో రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని, వరి కోయలను భూసార ఎరువుగా వినియోగించి వ్యవసాయ ఖర్చులను తగ్గించుకోవాలని ఎస్ఐ తాజుద్దీన్ సూచించారు. ఇతరులకు నష్టం కలిగించే విధంగా కోయలను కాల్చితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# మండలంలో విచ్చలవిడిగా అక్రమ ఇసుక, మట్టి తోలకాలు..

- **తారురోడ్లు, సిమెంట్ రోడ్లు మట్టి రోడ్లుగా మారుతున్న వైనం..**
- **మితిమీరిన ట్రాక్టర్ల వేగం - ప్రమాదాలకు మూలం..**
- **చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం.**

**మణుగూరు.మే 31, (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండల వ్యాప్తంగా నిత్యం వందలాది ట్రాక్టర్లు అక్రమంగా మట్టి, ఇసుక తోలకాలు విచ్చలవిడిగా సాగిస్తూ..ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా ట్రాక్టర్లు మట్టి, ఇసుక ను తరలిస్తుండడంతో రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రభుత్వం లక్షల రూపాయల వ్యయంతో పక్కాగా నిర్మించిన తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు మట్టి కప్పుకుపోయి పూర్తిగా పాడైపోతున్నాయి. ట్రాక్టర్ యజమానులు వేగంగా ట్రిప్పులు పడడం కోసం ట్రాక్టర్ ల వెనుక డోర్ లను తీసేసి JCB యంత్రాలతో మట్టిని నిండుగా పోసి వేగంగా నడుపుతుండడంతో కొన్ని కొన్ని సార్లు అందులోనుండి మట్టి పెళ్ళలు జారి రోడ్డుమీద పడి ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు.ట్రాక్టర్లు వెళ్ళిన వెంటనే రోడ్డు మొత్తం దుమ్ము ధూళి నిండిపోయి దారి కనిపించక వాహనదారులు,పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా ట్రాక్టర్ల మితిమీరిన వేగం ప్రజల్లో భయాందోళనలకు కారణమవుతుంది.పాఠశాలలకు వెళ్లే పిల్లలు,వృద్ధులు రోడ్డు దాటాలంటే ప్రమాదకరంగా మారింది. డ్రైవర్లు నియంత్రణ లేకుండా వేగంగా వాహనాలు నడపడం, దానికి తోడు ట్రాక్టర్లకు డెక్ లను అమర్చుకుని ,విపరీతమైన సౌండ్ పెట్టుకుని,వెనుక నుండి వచ్చే వాహనాలు హరన్ కొట్టినా వినిపించుకోకుండా వెళ్ళడం, మరియు చెవుల్లో హెడ్ సెట్ పెట్టుకుని పాటలు వింటూ డ్రైవింగ్ చేయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, రోజు రోజుకు పరిస్థితులు తీవ్రమవుతూ చిన్నపాటి ప్రమాదాలు జరిగినప్పటికీ.. పెద్దప్రమాదం జరిగే వరకు అధికారులు స్పందించరా అన్న ప్రశ్న ప్రజల్లో వ్యక్తమౌతుంది. అక్రమంగా మట్టి, ఇసుక తరలింపును అరికట్టాల్సిన బాధ్యత ఉన్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లను ధ్వంసం చేస్తూ.. ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న ఈ పరిస్థితి పై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ట్రాక్టర్ల వేగాన్ని నియంత్రించి, అక్రమ రవాణా పై కఠిన చర్యలు చేపట్టకపోతే మరిన్ని ప్రమాదాలు తప్పవని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



